

మోసకార్లు..!

అద్దెకు తీసుకుని కార్లతో ఉడాయిస్తున్న దొంగలు

- తాకట్టుపెట్టి సొమ్ము చేసుకుంటున్న వైనం
- అనంతరం రెండో కీతో అవే కార్లతో పరారీ
- ఫిర్యాదు చేసినా కేసు కట్టని పోలీసులు
- స్టేషన్ల చుట్టూ బాధితుల ప్రదక్షిణ

అనంతపురం క్రైం, మే 19(ఆంధ్రజ్యోతి): కాలం మారుతున్న కొద్దీ నేరాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. పోలీసులు టెక్నాలజీ అంటూ ముందుకొస్తుంటే... కొంగొత్త ఆలోచనలతో నేరగాళ్లు మరింత ఫాస్ట్‌గా దూసుకెళ్తున్నారు. ఎప్పటికప్పుడు నేరాలు లేటెస్ట్‌గా చేస్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం కార్ల అపహరణ హైక్లాస్‌గా జరిగిపోతోంది. అద్దెకు తీసుకుని కార్లను తాకట్టు పెట్టేస్తున్నారు. ఇక్కడ బాడుగ ఎగ్గొట్టడమే కాకుండా అక్కడ డబ్బు కొట్టేస్తున్నారు. మళ్లీ రెండు, మూడ్రోజుల్లోనే తాకట్టు పెట్టిన కారును సైతం తీసుకుని పరారవుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఈ తతంగం జరుగుతోంది. అనంతపురం నగర శివారులో ఉంటున్న ఓ పదిమంది ఈ వ్యవహారం నడుపుతున్నట్లు తెలుస్తోంది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే దిక్కు లేదు. దీంతో ఆ దొంగలు మరింత రెచ్చిపోతున్నారు.

ఆ కారు అపహరిస్తారు..

తాకట్టు పెట్టుకున్న వ్యక్తికి కారుతో పాటు తాళాలిచ్చేస్తారు. అప్పటికే వారం రోజులు దాటిపోయింది. ఓనర్... ఇన్ని రోజులైందనీ, కారు ఏమైందని అడుగుతాడు. కొన్ని సార్లు ఫోన్ కూడా లిఫ్ట్ చేయరు. తీరిగ్గా 'మీ కారు ఉందన్నా... ఎక్కడికీ పోలేదు. కీస్ ఎక్కడో పోయాయి... మీ వద్ద రెండో కీ ఉంటుంది కదా.. అది ఇస్తే తీసుకొస్తామ'ని నాటకీయంగా చెబుతారు. అది వారు నమ్మేసి ఇస్తారు. ఆ రెండో కీతో తాకట్టు పెట్టిన వ్యక్తి వద్ద ఉన్న కారును తీసుకుని పరారవుతారు. కారు కనిపించకపోవడంతో ఫైనాన్స్‌లో ఉన్న కారు అంటగట్టాడని భావించి... ఎందుకిలా చేశావని అడగటానికి ఫోన్ చేస్తారు. అటు అద్దెకిచ్చిన వ్యక్తి ఎప్పుడిస్తావయ్యా అంటూ ఫోన్ చేస్తాడు. ఇద్దరి ఫోన్లు ఎత్తకుండా ఆ దొంగ ఎక్కడో సేద తీరుతుంటాడు.

అద్దెకు తీసుకుని.. తాకట్టుపెట్టి..

నేరుగా కారు యజమాని వద్దకు వెళ్తారు. కుటుంబసభ్యుల్లో ఒకరికి అనారోగ్యంగా ఉందనీ, ఎక్కడికైనా తీసుకెళ్లాలని కారు వారం రోజుల పాటు అద్దెకు కావాలంటారు. అందుకు ఆధార్ కార్డు, ఇతర ఆధారాలు చూపించి మరీ కారు తీసుకెళ్తారు. కారు ఓనర్ అందులో జీపీఎస్ పెట్టుకున్నా తేడా రాదు. నాలుగైదు సార్లు అతడు చెప్పినట్లే సంబంధిత ప్రాంత పరిధిలోనే కారు ఉంటుంది. అన్ని రోజులకుగాను వెంటనే అద్దె కూడా చెల్లిస్తాడు. ఆ రోజో.. మరుసటి దినమో.. తాకట్టు పెట్టేస్తాడు. తనకు డబ్బు చాలా అవసరం ఉందనీ, మరి కొన్ని రోజుల్లో పంట చేతికొస్తుందని చెప్పి కారు తాకట్టు పెట్టేస్తారు. ఆ సమయంలో ఆర్‌సీ కూడా డౌన్‌లోడ్ చేసి నీట్‌గా ల్యామినేషన్ చేసింది ఇస్తారట. అలా కనీసం రూ.70వేల నుంచి రూ.2 లక్షల వరకు డబ్బు తీసుకుని అక్కడి నుంచి వచ్చేస్తారు.

ఇలా తెచ్చుకున్నాడు...

నగరంలో దాదు అనే వ్యక్తి వద్దకు రెండున్నర నెలల క్రితం సురేష్ రెడ్డి అనే వ్యక్తి వచ్చి కారు అడిగాడు. తన తండ్రికి అనారోగ్యంగా ఉందనీ, బెంగళూరు వెళ్లాలని ఐదు రోజులు కారు కావాలని చెప్పాడు. సురేష్‌రెడ్డి తండ్రి రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి. చివరకు కారు ఇచ్చే ముందు సురేష్‌రెడ్డి ఇంటిని కూడా దాదు చూశాడు. ఐదు రోజుల అనంతపురం పరిధిలో ఉండటంతో అనుమానం వచ్చి అడిగాడు. బెంగళూరు వెళ్లలేదనీ, ఇక్కడే చూపిస్తున్నామని చెప్పాడు. రెండురోజుల తరువాత శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో విప్రో కంపెనీలో పనిచేసే యువకుడి వద్ద తాకట్టు పెట్టాడు. రూ.1.50 లక్ష తీసుకున్నాడు. దాదు ఫోన్ చేస్తే తాళాలు పోయాయని చెప్పి మరో తాళం తీసుకున్నాడు. అక్కడి నుంచి హిందూపురం వెళ్లి తాకట్టు పెట్టిన కారు ఎత్తుకెళ్లాడు. కొన్ని రోజులు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో దాదు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేయలేదు. దాదు రోజూ స్టేషన్ వద్దకు వెళ్తుంటే ఫోన్ ట్రేస్ చేశారు. అతడు తన ప్రియురాలి ఇంట్లో ఏకాంతంగా ఉన్నాడని తెలుసుకుని, రాత్రంతా ఆ ఇంటి వద్దే కాపు కాశాడు. ఉదయం తనకు తోడుగా కానిస్టేబుల్‌ను పెట్టుకున్నాడు. అతను లేచి కాలకృత్యాలు తీర్చుకుని బయటకు వచ్చేలోపు పట్టుకుని, పోలీసుస్టేషన్‌కు పిలుచుకొచ్చారు. అలా ఎట్టకేలకు తన కారు తెచ్చుకున్నాడు. సురేష్‌రెడ్డిని పోలీసులు కేవలం మందలించి వదిలేశారట. అంతకుముందే సురేష్‌రెడ్డి ఫోన్‌ను దాదు వద్దే పెట్టుకున్నాడు. ఫోన్ వచ్చిన ప్రతి సారి ఇలా అద్దెకు ఇచ్చిన బాధితులో, తాకట్టు పెట్టుకున్న వారో చేస్తూనే ఉన్నారట.

కేసులు కట్టరు... దొంగనూ పట్టరు..

బాధితులు కార్లు తీసుకెళ్లారని, అద్దె కూడా చెల్లించలేదని పోలీసు స్టేషన్ల చుట్టూ తిరుగుతుంటే పట్టించుకునే నాథుడే లేడు. జిల్లాలో దాదాపు ప్రతి నియోజకవర్గంలో ఇలాంటి వ్యవహారాలు జరిగినట్లు తెలుస్తోంది. అనంతపురంలో వన్‌టౌన్, త్రీటౌన్, ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్లలో బాధితులు కేసులు పెట్టారు. తాడిపత్రి, కళ్యాణదుర్గం, గుంతకల్లులోనూ పోలీసులను ఆశ్రయించారు. న్యాయం మాత్రం జరగలేదు. 35 నుంచి 40 కార్లు అలా తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. కళ్యాణదుర్గంలోనే అత్యధికంగా ఐదుగురు బాధితులున్నారు. దీంతో వారంతా పోలీసు స్టేషన్ల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే ఆ దొంగలు మరిన్ని కార్లు ఎత్తుకుపోతారనడంలో సందేహం లేదు.



వేణుగోపాల్ నగర్ నుంచి బాడుగ పేరు చెప్పి తీసుకెళ్లిన కారు

బాధితులు కోకొల్లలు..

నగరంలోని ఓ కారును అద్దెకు తీసుకున్న సురేష్‌రెడ్డి పది రోజుల క్రితం టీవీ టవర్ సమీపంలో నివాసముంటున్న రామానాయుడుకు తాకట్టు పెట్టాడు. అతడి వద్ద రూ.70వేలు తీసుకున్నాడు. రెండోరోజు రాత్రి అతని వద్దనున్న కారును ఎత్తుకెళ్లారు. దీంతో అతడికి దిక్కుతోచలేదు. ఆరా తీస్తే అది సురేష్‌రెడ్డి పనేనని తెలిసింది.

- జిల్లాలో ఓ ప్రాంతానికి చెందిన కారును తాడిపత్రి పట్టణంలో లక్ష్మి అనే మహిళ వద్ద తాకట్టు పెట్టారు. రూ.1.50లక్షలు తీసుకెళ్లారు. అదేరోజు రాత్రి ఆ కారుతోనే ఉడాయించారు. దీంతో బాధితురాలు అటు తాడిపత్రి, ఇటు అనంతపురంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది.
- తొమ్మిది నెలల క్రితం కళ్యాణదుర్గం పట్టణంలోని రాజు అనే వ్యక్తి వద్ద సురేష్‌రెడ్డి తాకట్టు పెట్టాడు. రూ.1.50 లక్షలు తీసుకున్నాడు. రెండురోజుల తరువాత ఓ రోజు రాత్రి కారు ఎత్తుకెళ్లాడు. ఆ డబ్బూ ఇవ్వలేదు, కారూ రాలేదు. సందర్భం వచ్చినపుడల్లా సురేష్ రెడ్డి ఇంటికెళ్లడం... అతను కొన్నిసార్లు కనిపించి త్వరలో ఇస్తానని చెప్పడం... రాజు తిరిగి వెళ్లిపోవడం జరుగుతోంది.
- అదే నియోజకవర్గ కేంద్రానికి చెందిన తిమ్మ నుంచి మూడు నెలల క్రితం రెండు కార్లు తాకట్టు పెట్టి రూ.2.50లక్షలు తీసుకెళ్లాడు. ఇంతవరకు అతీగతీ లేదు.
- కళ్యాణదుర్గం పరిధిలోనే తొమ్మిది కార్ల వరకు ఇలా తాకట్టు పెట్టి రూ.12లక్షల వరకు డబ్బు దర్జాగా తీసుకెళ్లాడు.
- గతనెల 13న అనంతపురంలోని వేణుగోపాల్‌నగర్‌కు చెందిన హరి వద్దకు శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బకు చెందిన పవన్‌కుమార్‌రెడ్డి వచ్చాడు. తన బాబాయికి ఆరోగ్యం బాగోలేదని చెప్పి కారు అద్దెకు తీసుకెళ్లాడు. ఐదురోజులకు రూ.10వేలు చెల్లించాడు. కదిరి సమీపంలోని ఎర్రదొడ్డికి చెందిన కిరణ్‌తో కలిసి కదిరిలో తాకట్టు పెట్టారు. దీనిపై బాధితుడు.. కదిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. వన్‌టౌన్‌లో ఇవ్వానీ, తాము ఫాలో చేస్తామన్నారట.

ఇలా అక్కడా.. ఇక్కడా కాదు దాదాపు 10 మంది వరకు 40 వరకు కార్లు అద్దెకు తీసుకుని, తాకట్టు పెట్టి అక్కడా రూ.లక్షల్లో డబ్బు కాజేసి జల్సాలు చేస్తున్నారు. మరి వీరి గుట్టు పోలీసులు ఎప్పుడు రట్టు చేస్తారో...?



అనంతపురం రాంనగర్‌లో..

సారా..!

మానం కంటే..
ప్రాణం కంటే..
మద్యం మత్తు
మరీ అంత ఎక్కువా..?

పొద్దు పొద్దున్నే
పరుగున వెళ్లి..
పొట్ట నిండా తాగేసి..
ఇట్లా పడిపోవడం ఏమిటి..?

అమ్మేవారికి..
అమ్మించేవారికి..
జనం బతుకు మీద
బాధ్యత ఏముంటుంది..?

తెలుసుకోవాలి కదా...!
బతుకును మలుచుకోవాలి కదా..!

- ఆంధ్రజ్యోతి, అనంతపురం



ఏమిటీ దౌర్భాగ్యం..?



అనంతపురం 2వ రోడ్డులో..

కళ్యాణదుర్గం మండలం ఎర్రంపల్లి గేటు వద్ద ప్రధాన రహదారిపై ఇలా..



దగ్గరకొస్తే కరెంటు పట్టుకుంటా..!

'నేను మెంటల్ నా కొడుకును. నన్ను పట్టుకునేందుకు వస్తే కరెంటు పట్టుకుంటా' అని పోలీసులను హడలెత్తించాడు హత్య కేసు నిందితుడు. అనంతపురం ఎర్రనేల కొట్టాలకు చెందిన చిల్లర ప్రకాష్ మూడు నెలల క్రితం గంగమ్మ అనే మహిళను హత్య చేశాడు. తన పెదనాన్న కుటుంబానికి చెందిన రెండు బైకులను ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో ధ్వంసం చేశాడు. పెదనాన్న కొడుకు యోగానందపై దాడి చేశాడు. ఈ విషయం తెలుసుకున్న త్రీటౌన్ పోలీసులకు అతన్ని పట్టుకునేందుకు కాలనీకి వెళ్లారు. దీంతో ప్రకాష్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాడు. తనను పట్టుకుంటే తాను కరెంట్ వైర్లను పట్టుకుంటానని పోలీసులను హెచ్చరించాడు. దీంతో పోలీసులు వెనక్కు వెళ్లిపోయారు. యోగానంద ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేశారు. అనంతరం ప్రకాష్ 41 నోటీసు ఇచ్చి పంపారు.



కరెంటు పట్టుకుంటానని బెదిరిస్తున్న ప్రకాష్

- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్రైం

ఇంకేం అర్హత కావాలి?

పింఛన్ కోసం 74ఏళ్ల ఒంటరి వృద్ధురాలి నిరీక్షణ



తిమ్మక్క

యాడికి, మే 19(ఆంధ్రజ్యోతి): పింఛన్ కోసం ఓ పండుటాకు నిస్సహాయంగా ఎదురుచూస్తోంది. అవివాహిత అయిన ఆమె నా అన్న వారు లేక ఏడుపదులు దాటిన వయసులో పిడికెడు మెతుకుల కోసం అల్లాడిపోతోంది. ఆమె యాడికి మండలం కత్తిమానుపల్లి గ్రామానికి చెందిన 74ఏళ్ల తిమ్మక్క. చిన్న గుడిసెలో నివాసం ఉండే తిమ్మక్క కూలి పనులకు వెళ్తూ జీవించేది. ఇటీవల అనారోగ్యంతో ఇబ్బంది పడుతోంది. కనీసం పింఛన్ అన్న వస్తే ఏదోలా పొద్దు గడిపేస్తానంటూ ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఆరేళ్ల నుంచి పింఛన్ కోసం ఎన్ని సార్లు అర్జీలు ఇచ్చినా లాభం లేదని నిర్వేదంగా చెబుతోంది. అనర్హులు ఎంతోమంది పింఛన్ తీసుకుంటున్నారని, అన్ని విధాలుగా అర్హురాలైన తనకు ఎందుకు పింఛన్ ఇవ్వడం లేదని ప్రశ్నిస్తోంది. అధికారులు స్పందించి తనకు పింఛన్ మంజూరు చేయాలని తిమ్మక్క వేడుకుంటోంది.



కత్తిమానుపల్లెలో తిమ్మక్క నివాసం ఉండే ఇల్లు



వీల్ చైర్‌లో అంజినమ్మను తీసుకువస్తున్న కూతుళ్లు, మనవడు

పింఛన్ ఇప్పించండి సారు..!

కొడుకులు, కోడళ్లు, మనవలు, మనవరాళ్లు, మునిమనవలతో ఆఖరి గడియల్లో ఆనందంగా గడపాల్సిన నేను కొడుకులకు భారమయ్యాను. ఉన్నదంతా కొడుకులకు పంచి పెద్దింటి పేదరాలయ్యాను. మీరైనా కనీసం పింఛన్ ఇప్పించి ఈ ముసలి తల్లిని ఆదుకోండి సారు' అంటూ వీల్‌చైర్‌లో నుంచి ఆవేదన వ్యక్తం చేస్తూ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చారు.

తన ఊపిరితో
ప్రాణం పోసి
పేగుతో
బంధమల్లిన అమ్మ
అంటరానిదై పోయింది.

కనిపెంచిన కన్నతల్లి పట్ల
కనికరం మాయమైంది.
స్థన్యమిచ్చిన అమ్మ
చనుబాలతీపి మరుగున పడింది.


అర్ధరాత్రి, అపరాత్రి వేళ చేసిన
శుశ్రూషలు పనికిరానివై పోయాయి.
ముద్ద ముద్దకు ఒకరి పేరు చెప్పి
కడుపునింపిన తల్లి ప్రేమ భారమైంది.

బుద్ధిమాటలతో
జీవిత పాఠం నేర్పిన
తొలి గురువుకు బిడ్డలు
చక్కని గుణపాఠం అప్పజెప్పారు.

అమ్మ అవస్థ

పట్టించుకోని ముగ్గురు కొడుకులు

న్యాయం కోసం కలెక్టరేట్‌కు..



అనంతపురం క్లాక్‌టవర్, మే 19 (ఆంధ్రజ్యోతి): భర్త, అరడజను మంది పిల్లలు, పాడిపంటలతో నిండైన జీవితం గడిపిన ఆ ఇల్లాలు అవసాన దశలో అవస్థలు పడుతోంది. ముగ్గురు కుమారులున్నా పట్టించుకోకపోవడంతో కుమార్తెల వద్ద కాలం వెళ్లదీస్తోంది. ఎనిమిది పదుల వయసులో న్యాయం కోరుతూ వీల్‌చైర్‌లో సోమవారం కలెక్టరేట్‌కు వచ్చింది. ఆమే గుత్తి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన అంజినమ్మ. ఈమెకు ముగ్గురు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు సంతానం. సుమారు 30ఎకరాలకు పైగా భూమి, 14తులాల బంగారం, ఇళ్లు ఉన్నాయి. అంతాబాగానే ఉండేది. కానీ కరోనా మహమ్మారితో 2019లో భర్త చిన్నపరెడ్డి మరణించడంతో అంజినమ్మకు కష్టాలు మొదలయ్యాయి. ఉన్న ఆస్తిని కొడుకులు లాగేసుకుని అంజినమ్మను ఇంటి నుంచి గెంటేశారు. చూపు మందగించడం, వినికిడి సమస్యలతో బాధపడుతున్న ఆమెకు ఇద్దరు కుమార్తెలు సపర్యలు చేస్తున్నారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఇద్దరు కూతుళ్లు, మనవడితో కలిసి వేడుకుంది. గత ఐదేళ్లుగా ఇద్దరు కుమార్తెల వద్ద కాలం వెళ్లదీస్తున్నట్లు తెలిపింది. ఇదివరకే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీ ఇవ్వగా పోలీసులు ఆరా తీశారు. అప్పుడు 'మా అమ్మ నా వద్దే ఉంది' అని రెండో కుమారుడు పోలీసులకు తెలిపినట్లు బాధితురాలు వాపోయింది.



బూజుపట్టిన నిల్వచేసిన బ్యాడిగ మిరప

బూజుపట్టిన మిరప

ఏసీ గదుల్లో నిల్వ చేసినా రూ.20లక్షల నష్టం

లబోదిబోమంటున్న బాధిత రైతు

కూడేరు, మే 19 (ఆంధ్రజ్యోతి): నిల్వ చేసిన మిరపకు బూజు పట్టడంతో రైతు లబోదిబోమంటున్నాడు. మండలంలోని ఇప్పేరు గ్రామానికి చెందిన రైతు మల్లికార్జున తన 11 ఎకరాల పొలంలో బ్యాడిగ రకం మిరప సాగు చేశాడు. ఇందుకోసం రూ.13.5 లక్షలు పెట్టుబడి పెట్టాడు. తెగుళ్లు, పురుగుల దెబ్బకు ఆశించినంతగా దిగుబడి రాలేదు. గిట్టుబాటు ధర కూడా లేకపోవడంతో పండించిన 200 బస్తాల మిరపను కర్ణాటక రాష్ట్రంలోని బ్యాడిగ గ్రామంలో ఏసీ గదుల్లో నిల్వచేశాడు. గత రెండు నెలలుగా నిల్వ ఉన్న మిరపకాయలు రెండు రోజుల కిందట బూజు పట్టాయని సమాచారం వచ్చింది. వెళ్లిచూడగా కాయలు మొత్తం బూజు పట్టాయని బోరున విలపించాడు. తనకు న్యాయం చేయాలని అక్కడి యజమానులను వేడుకున్నా పట్టించుకోలేదని రూ.20లక్షల వరకు నష్టం రావడంతో తాను ఎలా అప్పులు తీర్చాలని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్వాహకుల నిర్లక్ష్యంతో పంట మొత్తం నష్టపోయానని, న్యాయం చేయాలని అడిగితే తనపైనే దౌర్జన్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

కదిరి టీడీపీ కైవసం

- మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా దిల్‌షాదున్నీషా
- వైస్ చైర్మన్లుగా మద్దేపల్లి రాజశేఖరాచారి, సేగు సుధారాణి
- ఎన్నికకు గైర్హాజరైన వైసీపీ కౌన్సిలర్లు

కదిరి, మే19(ఆంధ్రజ్యోతి): కదిరి మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా దిల్‌షాద్ దున్నీషా, వైస్ చైర్మన్లుగా మద్దేపల్లి రాజశేఖర ఆచారి, సేగు సుధా రాణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో సోమవారం ఉదయం చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ల ఎన్నికకు సమావేశం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఆర్డీవో వీవీ ఎస్ శర్మ, ఉప అధికారిగా కమిషనర్ కిరణ్‌కుమార్ వ్యవహరించారు. మొత్తం 36 మంది కౌన్సిలర్లు, ఒక ఎక్స్‌అఫిషియో మెంబర్‌తో కలిపి మొత్తం 37మంది ఉన్నారు. వీరిలో టీడీపీకి చెందిన 25మంది సభ్యులు హాజరుకాగా, 11మంది వైసీపీ కౌన్సిలర్లు హాజరుకాలేదు. సమావేశం నిర్వహించడానికి అవసరమైన కోరం ఉండటంతో ఎన్నికలను నిర్వహించారు. చైర్‌పర్సన్‌గా 10వార్డు కౌన్సిలర్ దిల్‌షాద్‌దున్నీషా, వైస్ చైర్మన్లుగా 19 వార్డు కౌన్సిలర్ మద్దెపల్లి రాజశేఖర ఆచారి, 21 వార్డు కౌన్సిలర్ సేగు సుధారాణిలను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. అనంతరం చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లకు డిక్లరేషన్ అందజేసి, వారిచేత ఎన్నికల అధికారి ప్రమాణం చేయించారు. ఎన్నిక అనంతరం టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నాయి. ఎన్నికైన వారు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ నివాసానికి వెళ్లి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

కందికుంట వ్యూహంతో...

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ వ్యూహంతో కదిరి మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం టీడీపీకి దక్కింది. గతంలో ఐదుగురు మాత్రమే టీడీపీ తరపున కౌన్సిలర్లుగా గెలించారు. అయితే ఎన్నికల ముందు ఇండిపెండెంట్ సభ్యుడు, ఆరుగురు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. దీంతో టీడీపీ బలం 12కు పెరిగింది. ఎన్నికల తరువాత వైసీపీ కౌన్సిలర్లు 14మంది, అప్పటి చైర్‌పర్సన్ నజీమున్నీషాపై తిరుగుబాటు చేశారు. అనంతరం టీడీపీతో కలిసి అవిశ్వాస తీర్మానం పెట్టడానికి సిద్ధమయ్యారు. దానిని అవకాశంగా మలుచుకున్న ఎమ్మెల్యే అవిశ్వాసన తీర్మానానికి రంగం సిద్ధం చేశారు. టీడీపీలో ఉన్న 12మంది, వైసీపీలో ఉన్న 13మందిని కలుపుకుని అవిశ్వాస తీర్మానం నెగ్గించారు. అనంతరం చైర్మన్ ఎన్నిక సందర్భంగా తిరుగుబాటు వైసీపీ కౌన్సిలర్లు 13మంది టీడీపీలోకి చేరారు.


సమావేశంలో పాల్గొన్న కౌన్సిల్ సభ్యులు


చైర్‌పర్సన్‌గా ఎన్నికైన దిల్‌షాదున్నీషా


వైస్ చైర్‌పర్సన్ సేగు సుధారాణి


వైస్ చైర్మన్ మద్దేపల్లి రాజశేఖరాచారి

సమావేశాలకు వైసీపీ వచ్చేనా..?

మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా టీడీపీ కౌన్సిలర్లు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. మిగిలిన 11మంది వైసీపీ కౌన్సిలర్లు ఎవరు హాజరు కాలేదు. గతంలో వైసీపీకి 30మంది కౌన్సిలర్ల ఉండే వారు. ఆ ఆపార్టీ నుంచి ఏకంగా 19మంది కౌన్సిలర్లు, వైసీపీకి మద్దతిచ్చిన ఇండిపెండెంట్ కూడా టీడీపీలో చేరారు. ఉన్న వారు సమావేశాలకు హాజరు కాకపోవడంతో మున్సిపల్‌కౌన్సిల్‌లో వైసీపీ ఖాళీ అయిందని పలువురు చర్చించుకుంటున్నారు. భవిష్యత్‌లో సాధారణ సమావేశాలకు హాజరవుతారా లేదా అనే సందేహాన్ని కూడా వ్యక్తం చేస్తున్నారు.


స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా చక్రస్నానం

ఉరవకొండ, మే19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి సుప్రభాత సేవ, అర్చన, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామివారిని మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఉద్భవలక్ష్మీ అమ్మవారి ఆలయానికి ఎదురుగా ఉన్న మండపంలో శాస్త్రోక్తంగా ఉత్సవమూర్తులకు చక్రస్నానం చేశారు. అనంతరం అర్చకులు వసంతాలు చల్లుకున్నారు. రాత్రి శయనోత్సవం నిర్వహించారు. ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఈఓ రమేష్‌బాబు, అర్చకులు పాల్గొన్నారు.


ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే అమిలినేని

పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామిని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు దర్శించుకున్నారు. ఆలయ ఈఓ, అర్చకులు.. ఆయనకు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు ఆయన పేరిట అర్చన, పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు.

టెన్త్ సప్లిమెంటరీకి 975 మంది గైర్హాజరు

అనంతపురం విద్య, మే 19(ఆంధ్రజ్యోతి): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు తొలిరోజు సోమవారం 975 మంది గైర్హాజరైనట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 42 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా.. రెగ్యులర్ విద్యార్థులు 2,975 మందికిగాను 2,039 మంది హాజరుకాగా.. 936 మంది గైర్హాజరయ్యారన్నారు. ప్రైవేటు విద్యార్థులు 68 మందికిగాను 29 మంది హా జరుకాగా.. 39 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. అధికారులు, ఫ్ల యింగ్ స్క్వాడ్ బృందాలు 21 కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు.

ముచ్చటగా మూడోసారి..!

- రామగిరి ఎంపీపీ ఎన్నిక వాయిదా
- హాజరుకాని వైసీపీ ఎంపీటీసీలు

రామగిరి, మే 19(ఆంధ్రజ్యోతి): రామగిరి ఎంపీపీ ఉప ఎన్నిక ముచ్చటగా మూడోసారి వాయిదాపడింది. సోమవారం ఎంపీపీ ఎన్నిక నిర్వహించాలని అధికారులు అన్ని ఏర్పా ట్లు చేశారు. ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరు కావడంతో ఎంపీపీ ఉప ఎన్నికను నిరవధింగా వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి సంజీవ య్య ప్రకటించారు. మార్చి 27వ తేదీ ఎంపీపీ ఉప ఎన్నిక నిర్వహించగా వైసీపీ సభ్యులు గైర్హాజరయ్యారు. మరుసటి రోజు 28వతేదీ ఎన్నికను నిర్వహించగా నాటకీయ పరిణామాలతో వైసీపీ ముఖ్యనాయకుల సూచనలతో సభ్యులు హాజరు కాలేదు. ఓటమి భయంతో వైసీపీ నాయకులు క్యాంపు రాజకీయాలకు తెరలేపారు. టీడీపీలో చేరిన మహిళా సభ్యురాలిని కూడా తిరిగి వారే తీసుకెళ్లారు. సోమవారం ఉదయం 10గంటలకు ఎన్నికల నిర్వహణకు అధికారులు రాగా.. మొదట టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు, వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన ఇద్దరు సభ్యులు వచ్చారు. 15 నిమిషాల తరువాత వైసీపీ నుంచి టీడీపీలో చేరిన మరో సభ్యుడు వచ్చాడు. ఎన్నికల అధికారులు 11 గంటల నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలు పెట్టారు. మహిళలకు రిజర్వు చేసిన ఎంపీపీ స్థానానికి.. మహిళా అభ్యర్థులు హాజరు కాలేదు. సమయం ముగిసేవరకు చూసిన అధికారులు.. మహిళా అభ్యర్థులు ఎవరూ రాకపోవడంతో ఎన్నికను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి సంజీవయ్య ప్రకటించారు. ఎన్నిక సందర్భంగా డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐల తోపాటు మొత్తం 238 మంది పోలీసులు విధుల్లో పాల్గొన్నారు. డీఎస్పీ హేమంత్‌కుమార్, సీఐ శ్రీధర్, ఎస్ఐ సుధాకర్‌యాదవ్ బందోబస్తును పర్యవేక్షించారు.


హాజరైన ముగ్గురు ఎంపీటీసీ సభ్యులు

ఎన్ఎస్ గేటులో భారీ బందోబస్తు

చెన్నేకొత్తపల్లి(ఆంధ్రజ్యోతి): రామగిరి ఎంపీపీ ఉప ఎన్నిక నేపథ్యంలో చెన్నేకొత్తపల్లి మండలంలోని ఎన్ఎస్ గేటు వద్ద సోమవారం భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రామగిరి వైపు వెళ్లే రహదారిలో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. చెన్నేకొత్తపల్లిలో న్యామద్దల రోడ్డు, జాతీయ రహదారి కూడలిలో ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.


ఎన్ఎస్ గేటులో బందోబస్తులో పోలీసులు

ఎంపీపీగా సోముశేఖర్ రెడ్డి

గాండ్లపెంట, మే 19(ఆంధ్రజ్యోతి): గత కొద్దిరోజులుగా ఉత్కంఠ రేపిన ఎంపీపీ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఎంపీపీగా గజ్జల సోముశేఖర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల అధికారి విజయకుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. ఏడుగురు ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాల్సి ఉండగా, సోముశేఖర్ రెడ్డి, జయరామకృష్ణారెడ్డి, భారతి, గంగోజమ్మ మాత్రమే హాజరయ్యారు. ఎంపీపీగా సోముశేఖర్‌రెడ్డిని జయరామిరెడ్డి ప్రతిపాదించగా, భారతి బలపరిచారు. దీంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. అనంతరం ఎంపీపీగా గజ్జల సోముశేఖర్‌రెడ్డికి డిక్లరేషన్ పత్రాన్ని అందచేసి, ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ బాబురావు, ఆర్ఐ అశోక్ తదితరులున్నారు.

ఎంపీపీకి ఘన సన్మానం

ఎంపీపీ బాధ్యతలు స్వీకరించిన సోముశేఖర్‌రెడ్డికి ఎంపీడీఓ కార్యాలయంలో సన్మాన సభ నిర్వహించారు. ఎంపీపీని పలువురు పూలమాలలు, శాలువతో సన్మానించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌వరకు ఎంపీపీ ర్యాలీగా వచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండలకన్వీనర్ కొండయ్య, మాజీ సింగ్‌విండో అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, సర్పంచ్ రహంతుల్లా, శివప్పనాయుడు, సిద్ధారెడ్డి, చంద్ర, నరసింహులు, రామాంజులరెడ్డి, అక్రమ్ బాషా, మాజీ సర్పంచ్‌లు ప్రసాద్, కాకార్ల రవీంద్రారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న గజ్జల సోముశేఖర్‌రెడ్డి, అనంతరం సమావేశంలో ప్రసంగిస్తున్న దృశ్యం

మామిడి మాటున విషం..!

- కార్బైడ్‌తో మాగబెడుతున్న వ్యాపారులు
- పట్టించుకోని ఆహార భద్రతాధికారులు

పుట్టపర్తిరూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): ఫలరాజుగా ప్రసిద్ధిగాంచిన మామిడిపండ్లను ఇష్టపడని వారుండరు. ప్రస్తుతం మామిడిపండ్ల సీజన్ కావడంతో ఎక్కడ చూసినా విక్రయిస్తున్నారు. మంచి రంగును చూసి మైమరిచి ఎంతధరైనా కొనితీసుకెళ్తున్నారు. ఇంటికెళ్లి కోసి తినేటప్పుడు కాని దాని అసలు రంగు బయటపడటంలేదు. మంచి రంగుతో ఉన్న మామిడిపండ్లు రుచిపచీ లేకుండా చప్పగా ఉంటున్నాయి. సహజసిద్ధమైన రుచి, వాసన లేక మామిడి మధురాన్ని వినియోగదారులు అనుభవించలేకపోతున్నారు. దీనికి ప్రధాన కారణం రసాయనాలతో మాగబెట్టడమే. జిల్లా వ్యాప్తంగా వ్యాపారులు కార్బైడ్‌తో మాగపెట్టిన మామిడిపండ్లను విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని హరిస్తున్నారు. వీటిని అడ్డుకోవాల్సిన సంబంధిత అధికారులు మామూళ్లకు మరిగి మండీల వైపు చూడటంలేదనే విమర్శలు ఉన్నాయి.

సహజంగా ఎలా మాగబెడతారంటే..

చెట్ల నుంచి మామిడికాయలు కోశాక ఎండుగడ్డి మధ్యలో ఉంచి గదిలోని గాలి బయటకు పోకుండా వేడిపెంచడం ద్వారా మాగబెడతారు. వారం పదిరోజుల్లో పూర్తిగా మాగి మంచి వాసన, రంగుతో నిగనిగలాడుతాయి. ఈ పద్ధతిలో ఎక్కువ సమయం పడుతుండటంతో ఏదోరకంగా మాగబెట్టి త్వరగా అమ్మిసొమ్ము చేసుకోవాలనే ధోరణిలో వ్యాపారులు అడ్డదారులు తొక్కుతున్నారు.


కార్బైడ్‌తో మాగబెట్టిన మామిడిపండ్లు

వ్యాపారులు ఎలా చేస్తున్నారంటే..

పక్వానికి రాకుండానే మామిడికాయలను కోసేసి వ్యాపారులు కార్బైడ్ పెట్టి మాగబెడుతున్నారు. దీంతో రెండు మూడురోజుల్లోనే కాయలకు నిగనిగలాడే రంగు వస్తోంది. పైకి బాగా కనపడుతున్నా లోపల ఉన్న కండంతా దెబ్బతింటోంది. కార్బైడ్‌తో మాగబెట్టిన మామిడిపండ్లను తింటే కడుపులో వికారం, వాంతులు, విరేచనాలు, ఊపిరితిత్తుల సమస్యలే కాక క్యాన్సర్ వంటి భయంకరమైన వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. ఎర్ర రక్తకణాలు దెబ్బతిని రక్తంలో ఆక్సిజన్ తగ్గుతుందని వైద్యులు చెబుతున్నారు.

నిబంధనలు గాలికి..

ఆహారభద్రతా నిబంధనల మేరకు ఇథలీన్ పౌడర్‌తో మామిడికాయలను మాగబెట్టవచ్చు. పౌడర్ ఉండే కవర్‌కు రంధ్రం చేసి మామిడి పండ్ల మధ్యలో ఉంచడం ద్వారా గాలి బయటకు పోకుండా చూస్తే రెండుమూడురోజుల్లో కాయలు మాగే అవకాశం ఉంది. కార్బైడ్ వాడకంపై నిషేధం ఉంది. కార్బైడ్‌తో మామిడిపండ్లను మాగబెట్టి అమ్మడం నేరం. ఇలాంటి దుశ్చర్యలను అరికట్టాల్సిన ఆహారభద్రతా అధికారులు అటువైపు కూడా కన్నెత్తి చూడడం లేదు.

చర్యలు తీసుకుంటాం



కార్బైడ్‌తో మామిడికాయలను మాగబెడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. మండీలను తనిఖీచేసి చర్యలు తీసుకుంటాం. బాధ్యులపై కేసులు నమోదుచేస్తాం. ఎవరైనా ఇలాంటి పద్ధతిలో మామిడికాయలను మాగబెట్టి విక్రయిస్తుంటే మాకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. మా ఫోన్ నంబరు 9703383684కు ఫోన్‌చేసి వివరాలు తెలపవచ్చు. సదరు మామిడిపండ్లను శాంపిల్ తీసి నిబంధనలకు విరుద్ధంగా మాగబెడుతుంటే కేసులు నమోదు చేస్తాం.

-రామచంద్ర, జిల్లా ఆహార భద్రతాధికారి


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టరు వినోద్‌కుమార్

అర్జీల పరిష్కారంపై అలసత్వం వద్దు

కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాలు

ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు 460 అర్జీలు


ఫిర్యాదు చేయడానికి వచ్చిన బాధితులు

అనంతపురం టౌన్, మే19 (ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని కలెక్టరు వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కొనసాగింది. జిల్లా నలు మూలల నుంచి బాధితులు తరలిరావడంతో కలెక్టరేట్ కిటకిటలాడింది. మొత్తంమీద 460మంది తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అర్జీలు ఇచ్చారు. కలెక్టరుతో పాటు జేసీ శివనారాయణశర్మ, డీఆర్ఓ మలోల, డిప్యూటీ కలెక్టర్లు రామకృష్ణారెడ్డి, రామ్మోహన్, తిప్పేనాయక్, ఆనంద్, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. అనంతరం అధికారులతో కలెక్టరు సమీక్ష నిర్వహించారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీల పరిష్కారానికి ప్రతి ఒక్కరు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ సూచించారు ప్రతి అర్జీని సమగ్రంగా పరిశీలించి పరిష్కారం చూపాలన్నారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలపట్ల మర్యాదగా నడుచుకోవాలని సూచించారు.

- ప్రభుత్వం సాధారణ బదిలీలకు అనుమతించిందని, నిబంధనల మేరకే ప్రతిశాఖలో నిర్వహిస్తామని కలెక్టరు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఆయాశాఖల ఉన్నతాధికారులు తమ పరిధిలోని ఉద్యోగులను బదిలీ చేయాల్సి ఉంటుందన్నారు. నిబంధనలు అతిక్రమించకుండా బదిలీలు చేపట్టాలన్నారు.
- ప్రభుత్వ శాఖల పరిధిలో కాలం చెల్లిన వాహనాలు ఉంటే వాటిని వేలం వేయాలని అధికారులను కలెక్టరు ఆదేశించారు. జిల్లా రవాణాశాఖకు లేఖ రాస్తే మోటారు వాహన ఇన్‌స్పెక్టరు వచ్చి ఆ వాహనం విలువ తదితర అంశాలు తెలియజేస్తారన్నారు. ఆ తర్వాత వేలానికి ఆహ్వానించి వాహనాలు అమ్మి, వాటి వివరాలు రికార్డులలో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఈవేలం ప్రక్రియ జూన్ 20నాటికి పూర్తిచేయాలని కలెక్టరు ఆదేశించారు.

విద్యతోనే ఉన్నత స్థానాలకు..

విప్ కాలవ, ఎంపీ అంబికా

వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం


పురస్కారాలు అందజేస్తున్న విప్ కాలవ, ఎంపీ అంబికా

అనంతపురం క్లాక్‌టవర్/సెంట్రల్, మే 19(ఆంధ్రజ్యోతి): విద్యతో ఉన్నత స్థానాలకు చేరవచ్చని ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. వాల్మీకి ఉ ద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరంలో ప దో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన వాల్మీకి వి ద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం సోమవారం స్థానిక వా ల్మీకి భవన్‌లో నిర్వహించారు. విప్, ఎంపీ మాట్లాడుతూ.. పవిత్ర రామాయణ ఇతిహాసాన్ని భారతజాతికి అందించిన వాల్మీకి వారసులుగా చెప్పుకునేలా చదువుకు అత్యంత ప్రాధాన్యమివ్వాలన్నారు. పట్టుదలతో కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చాలని సూచించారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు ట్యాబ్‌లను విప్ కాలవ శ్రీనివాసులు వ్యక్తిగతంగా అందజేశారు. అనంతరం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, నగదు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాల్మీకి ఉద్యోగుల సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు ఆర్‌సీ అక్కులప్ప, చైతన్యకుమార్, కోశాధికారి పవన్‌కుమార్, అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య, రిటైర్డ్ డీఎఫ్ఓ ఆదినారాయణ, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు, మాజీ కార్పొరేటర్ తలారి ఆదినారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ఈఏపీసెట్ ప్రారంభం

తొలిరోజు 90శాతం హాజరు

అనంతపురం సెంట్రల్, మే 19(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీఈఏపీసెట్-20 25 సోమవారం ప్రారంభమయ్యాయి. 19, 20 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమింగ్. 21 నుంచి 27 వరకు ఇంజనీరింగ్ స్ట్రీమింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. రోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలుంటాయి. అనంతపురంలో ఐదు, తాడిపత్రిలో రెండు, గుత్తి, పుట్టపర్తిలో ఒకటి చొప్పున మొత్తం 9 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. సోమవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3,021 మంది విద్యార్థులకుగాను 2,730 మంది పరీక్షలు రాసినట్లు ని ర్వాహక అధికారులు తెలిపారు. హాజరు శాతం 90.37 నమోదైనట్లు పేర్కొన్నారు.

ఏఐవైఎఫ్ జాతీయ కార్యవర్గంలో అనంతకు చోటు

కార్యవర్గ సభ్యుడిగా సంతోష్‌కుమార్



అనంతపురం విద్య, మే 19(ఆంధ్రజ్యోతి): అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ కార్యవర్గంలో జిల్లాకు చోటు దక్కింది. జాతీయ కార్యవర్గ సభ్యుడిగా జిల్లాకు చెందిన సంతోష్‌కుమార్‌ను ఎంపిక చేశారు. ఈ విషయాన్ని ఆయన సోమవారం వెల్లడించారు. తిరుపతిలో నిర్వహించిన ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల్లో కొత్తగా జాతీయ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారన్నారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా పనిచేస్తున్న తనకు జాతీయ కార్యవర్గసభ్యుడిగా అవకాశం కల్పించారన్నారు. రాష్ట్రం నుంచి ఆరుగురికి అవకాశం దక్కిందని ఆయన వెల్లడించారు.

క్రైం కార్నర్

ఆటోని ఢీకొట్టిన ట్రాక్టర్

● ఒకరి మృతి.. మరొకరికి తీవ్రగాయాలు


ఆంజనేయులు(ఫైల్)

బత్తలపల్లి, మే19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్పుమడుగు క్రాస్ సమీపంలో సోమవారం తెల్ల వారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు త్రీవంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు ముదిగుబ్బకు చెందిన ఆంజనేయులు(59), అయన భార్య అలివేలమ్మ కాయగూరల వ్యాపారం చేసుకొని జీవనం సాగించే వారు. కాయగూరలు తెచ్చేందుకు సోమవారం తెల్లవారు జామున ముదిగుబ్బ నుంచి ధర్మవరం బయల్దేరారు. వెల్పుమడుగు క్రాస్ సమీపములో ఆటోను బండలలోడుతో వస్తున్న ట్రాక్టర్ వెనుక నుంచి ఢీకొట్టి, దూసుకుపోయింది. ఆటో నడుపుతున్న ఆంజనేయులు(59) అక్కడికక్కడే మృతిచెందగా అలివేలమ్మ తీవ్రంగా గాయపడింది. వాహనదారులు అలివేలమ్మను ప్రత్యేక వాహనంలో ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ఒకక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లలు పుట్టలేదని యువకుడి ఆత్మహత్య

గోరంట్ల, మే19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చేపల్లికి చెందిన మాజీ వలంటీర్ లోచర్ల చరణ్‌కుమార్ (33) ఉరి వేసుకుని సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ శేఖర్ తెలిపారు. నరసింహప్ప కుమారుడైన చరణ్‌కుమార్ మొదటి భార్య వదిలివేయడంతో, ఇటీవల అదే గ్రామానికి చెందిన పూజను రెండో పెళ్లి చేసుకున్నాడు. సంతానం కలగకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై, ఇంటి సమీపంలోని చింతచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. తండ్రి నరసింహప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మానసిక స్థితి సరిగాలేని మహిళ...

అనంతపురం క్రైం, మే19(ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిగా లేని ఓ మహిళ సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం నగర శివారులోని పాపంపేటకు చెందిన లక్ష్మిదేవి(45)భర్త 20 ఏళ్ల క్రితం మృతి చెందాడు. పదేళ్ల నుంచి ఆమె మానసిక స్థితి సరిగా లేదు. ఈక్రమంలోనే సోమవారం తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆమెకు ఇద్దరు కొడుకులు ఉండగా వారికి వివాహాలు అయ్యాయి.

వ్యభిచార గృహంపై దాడి

అనంతపురం క్రైం, మే 19(ఆంధ్రజ్యోతి): నగర శివారులో ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తుండగా రూరల్ పోలీసులు దాడి చేశారు. సీఐ శేఖర్ ఆధ్వర్యంలో సోమవారం దాడులు నిర్వహించారు. కళ్యాణదుర్గం రోడ్డులోని సీవీఆర్ కళాశాల వెనుక వైపు ఉన్న ఇంట్లో తనిఖీలు చేశారు. నిర్వాహకులు షేక్‌హసీనా, సెహనాజ్, ఓ విటుడిని అరెస్ట్ చేశారు. నిర్వాహకులు బెంగళూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి మహిళలను తీసుకొచ్చి వ్యభిచారం నిర్వహించేవారని పోలీసులు తెలిపారు.

చిరుత మృతి

మడకశిర, మే 19(ఆంధ్రజ్యోతి): రొళ్ల మండలం గుడ్డుగుర్కి గ్రామ సమీపంలోని బద్దికొండపై చిరుత మృతిచెందింది. గొర్రెలను మేపేందుకు సోమవారం కొండకు వెళ్లిన కాపరులు దుర్వాసన వస్తుండడాన్ని గమనించార. కుళ్లిపోయిన చిరుత కళేబరాన్ని గుర్తించారు. వారు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ అధికారి చక్రపాణి, సబ్ డీఎఫ్ఓ శ్రీనివాసరెడ్డి, సెక్షన్ ఆఫీసర్ కుళ్లాయప్ప, సిబ్బంది అక్కడికి చేరుకుని చిరుత కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పంచనామా నిర్వహించి, దహనం చేశారు. చిరుతకు పదేళ్ల వయసు ఉంటుందని వారు తెలిపారు. కొండ పక్కనే కర్ణాటక రాష్ట్రంలో మృతిచెందిన చిరుతను గుడ్డుగుర్కి సమీపంలోని కొండపై వేసి ఉంటారని అటవీశాఖ అధికారులు అనుమానిస్తున్నారు. చిరుత మృతిచెంది ఐదు రోజులు అయి ఉంటుందన్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కలెక్టర్ సంతకం ఫోర్జరీ కేసులో ఒకరి అరెస్ట్

అనంతపురం క్రైం, మే 19(ఆంధ్రజ్యోతి): నకిలీ అక్రెడిటేషన్, ఐడీ కార్డులు సృష్టించి, వాటిపై జిల్లా కలెక్టర్ డిజిటల్ సంతకం ఫోర్జరీ చేసిన వారిలో మన్నల దేవరాజును వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపిన మేరకు... నగరంలో ప్రజాబలం న్యూస్ పేరుతో యూట్యూబ్ చానల్ నడిపే చందులాల్, మన్నల దేవరాజు నకిలీ అక్రెడిటేషన్ కార్డు తయారు చేసి, వాటిపై జిల్లా కలెక్టర్ సంతకం ఫోర్జరీ చేశారు. ఆ కార్డును ఉపయోగించి ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులను బెదిరించి దౌర్జన్యాలకు పాల్పడినట్లు డీపీఆర్ఓ గురుస్వామిశెట్టి ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టిన వన్‌టౌన్ పోలీసులు సోమవారం మన్నల దేవరాజును అరెస్ట్ చేశారు. చందులాల్‌ను అరెస్ట్ చేయాల్సి ఉంది. ప్రభుత్వ అధికారుల సంతకాలు ఫోర్జరీ చేయడం, నకిలీ అక్రెడిటేషన్ కార్డులు తయారు చేయడం వంటివి చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని సీఐ హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నగర శివారులోని నేషనల్ పార్కు ఎదుట జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఈనెల 17న రాత్రి బుక్కరాయసముద్రం మండలం సంజీవపురానికి చెందినబీటెక్ విద్యార్థి లోక్‌నాథ్, ప్రియాంకనగర్‌కు చెందిన మహబూబ్‌పీరా బైక్‌లపై వస్తూ ఎదురెదురుగా ఢీ కొన్నారు. ఈ ఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. బీటెక్ విద్యార్థి తలకు తీవ్ర గాయం కావడంతో పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మరింత పెరిగిన చీనీ ధరలు

● టన్ను రూ.40 వేలకుపైగా పలికిన ధర

అనంతపురం రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ లో చీనీ ధరలు మరింత పెరిగాయి. కొన్ని రోజులుగా ధరలు పెరుగుతూ వస్తున్నాయి. రోజు పలుకుతున్న ధర కంటే సోమవారం మరింత పెరిగింది. ఏకంగా రూ.40వేలకుపైగా పలికాయి. గరిష్ఠంగా రూ.42వేలతో టన్ను కాయలు అమ్ముడుపోయాయి. సీజన్ ప్రారంభం నుంచి ఇదే అధిక ధర కావడం గమనార్హం. అలాగే కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి రూ.25వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 497 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

భూ తగాదాలతోనే రైతు దంపతుల హత్య

● రూరల్ డీఎస్పీ వెంకటేశులు
● ఆరుగురు నిందితుల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశులు, రాప్తాడు సీఐ శ్రీహర్ష

రాప్తాడు, మే 19(ఆంధ్రజ్యోతి): భూ తగాదాలతోనే రాప్తాడు రైతు దంపతులు చిగిచెర్ల నారాయణరెడ్డి, చిగిచెర్ల ముత్యాలమ్మ హత్యలు జరిగాయని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు, రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. గంగలకుంట క్రాస్ వద్ద ఆరుగురు నిందితులను అరెస్టు చేశామని, వారి నుంచి నాలుగు వేట కొడవళ్లు, కట్టెలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. విలేకరుల సమావేశంలో నిందితులు, ఆయుధాలను చూపించారు. రాప్తాడుకు చెందిన చిగిచెర్ల నారాయణరెడ్డికి (హతుడు చిగిచెర్ల నారాయణరెడ్డి తండ్రి) చెందిన 6.20 ఎకరాల భూమిని ఎకరం రూ.15 వేల ప్రకారం రూ.93 వేలకు రాప్తాడుకు చెందిన పుల్లమ్మ, వెంకటలక్ష్మి, నాగలక్ష్మమ్మ కొనుగోలు చేసి, అగ్రిమెంట్ చేసుకున్నారని తెలిపారు. కానీ నారాయణరెడ్డి ఆ ముగ్గురు మహిళల పేరిట అప్పట్లో రిజిస్ట్రేషన్ చేయించలేదని, దీంతో వారు కోర్టును ఆశ్రయించారని తెలిపారు. 2012లో కోర్టు ముగ్గురు మహిళలకు ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయించిందని, దీంతో చిగిచెర్ల నారాయణరెడ్డి.. ఆ భూమి తన బావ ఓబిరెడ్డి భార్య నారాయణమ్మకు చెందినదని కోర్టును ఆశ్రయించాడని తెలిపారు. అప్పటి నుంచి కోర్టులో విచారణ జరిగి, 2022లో ఆ భూమి ముగ్గురు మహిళలకే చెందిందని కోర్టు నిర్ధారించిందని తెలిపారు. హై కోర్టు కూడా ఇటీవల ఆ భూమి ముగ్గురు మహిళలకే చెందుతుందని ప్రకటించిందని తెలిపారు. హై కోర్టు ఆదేశాలు, జిల్లా రెవెన్యూ అధికారుల ఉత్తర్వుల మేరకు రాప్తాడు తహసీల్దార్ విజయకుమారి ఆ భూమిని ముగ్గురు మహిళల్లో ఒకరైన పుల్లమ్మ పేరిట ఈ నెల 14న ఆన్‌లైన్ చేశారని తెలిపారు. వివాదంలో ఉన్న ఆ భూమిని 2024 అక్టోబరులో ఎకరం రూ.56.50 లక్షలు చొప్పున 6.20 ఎకరాలను ఆ ముగ్గురు మహిళల నుంచి రాప్తాడుకు చెందిన పామళ్ల ధనుంజయ, పామళ్ల కొండప్ప, పామళ్ల ఇంద్రశేఖర్, గోనిపట్ల శీనా, పామళ్ల పండయ్య అలియాస్ కథల పండయ్య, గొల్లపల్లి జగదీష్, లక్ష్మీనారాయణ, నందకుమార్, బుల్లే నగేష్ కొని, అగ్రిమెంట్ చేసుకున్నారని తెలిపారు. ఈనెల 16న పామళ్ల ధనుంజయ, పామళ్ల కొండప్ప, గోనిపట్ల శీనా, కథల పండయ్య, హనుమంతరెడ్డి, బాల నరసింహారెడ్డి, నిరంజన్‌రెడ్డి, పుల్లమ్మ, కందుకూరు నాగలక్ష్మి, దండు నరేంద్ర, గొల్లపల్లి జగదీష్, గంగలకుంట లక్ష్మీనారాయణ, బుల్లె నగేష్ ఆ భూమిలోకి వెళ్లారని, ఈ భూమిలోకి వస్తే చంపేస్తామని చిగిచెర్ల నారాయణరెడ్డి భార్య ముత్యాలమ్మను బెదిరించారని తెలిపారు. ఆ మరుసటి రోజు శనివారం ఉదయం 9.30 గంటలకు ఆ పొలానికి వెళ్లి, ఎక్సకవేటర్‌తో దానిమ్మ చెట్లను తొలగిస్తుండగా... చిగిచెర్ల నారాయణరెడ్డి, ఆయన భార్య ముత్యాలమ్మ, కుమారుడు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, బావమరిది ప్రతాప్‌రెడ్డి పొలానికి వెళ్లి అడ్డుకున్నారని తెలిపారు. ఈ క్రమంలో ఇరు వర్గాల వారు ఘర్షణ పడ్డారని, ముత్యాలమ్మ, నారాయణరెడ్డిని ప్రత్యర్థులు వేట కొడవళ్లతో నరికారని తెలిపారు. ముత్యాలమ్మ అక్కడికక్కడే మృతి చెందగా, నారాయణరెడ్డి చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందాడని తెలిపారు. దాడిలో నారాయణరెడ్డి బావమరిది ప్రతాప్‌రెడ్డి గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. ఈ కేసులో రాప్తాడుకు చెందిన పామళ్ల ధనుంజయ, పామళ్ల ఇంద్రశేఖర్, దండు నరేంద్ర, నిరంజన్ రెడ్డి, కందుకూరుకు చెందిన దయ్యం హనుమంతరెడ్డి, గంగలకుంటకు చెందిన బుడగ లక్ష్మీనారాయణను అరెస్టు చేసి రిమాండుకు పంపుతున్నట్లు తెలిపారు. మరో ముద్దాయి పామళ్ల కొండప్ప ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, గొల్లపల్లి జగదీష్, కథల పండయ్య, గోనిపట్ల శీనా, బాలనరసింహారెడ్డి కోసం గాలిస్తున్నామని తెలిపారు.

పరిటాల కుటుంబ ప్రమేయం లేదు

చిగిచెర్ల నారాయణరెడ్డి, ముత్యాలమ్మ దంపతుల హత్యలో పరిటాల కుటుంబం, ధర్మవరపు మురళి ప్రమేయం లేదని టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి శవ రాజకీయాలు చేయకుండా వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు. రాప్తాడులోని టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు, కురుబ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గంగలకుంట రమణ, సర్పంచులు సాకే తిరుపాలు, శీనయ్య, ఉజ్జినప్ప, నరేష్, ఎంపీటీసీ జాఫర్, రవి, మాజీ మండల కన్వీనర్ నారాయణస్వామి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గంగలకుంట కిష్టా, శ్రీనివాసరెడ్డి, నాగరాజు, స్వర్ణక్క, వాటర్‌షెడ్ చైర్మన్ మల్లికార్జున, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, డీలర్లు విలేకరుల సమావేశం నిర్వహించారు. భూ తగాదాల కారణంగానే రైతు దంపతుల హత్య జరిగిందని అన్నారు. ఆ హత్యలను పరిటాల కుటుంబానికి ఆపాదించడం తగదని అన్నారు. రాప్తాడులో ఎక్కడ, ఎవరి హత్య జరిగినా ప్రకాశ్ రెడ్డి శవ రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే పరిటాల సునీత అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని, వాటిని చూసి ఓర్వలేక ప్రకాశ్ రెడ్డి రాజకీయం చేస్తున్నారని అన్నారు. ఐదేళ్ల అధికారంలో ఉన్నా ఆయన చేసిందేమీ లేదని అన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

వాన బ్రేక్..!

● నాలుగైదు రోజులుగా భారీ వర్షాలు
● హంద్రీనీవా కాలువ పనులకు ఆటంకం
● ఎక్కడికక్కడ ఆగిపోయిన వైనం


కాలువలోకి చేరిన వర్షపు నీరు


ఆగిన హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు

అనంతపురం క్లాక్‌టవర్, మే 19(ఆంధ్రజ్యోతి): జోరుగా సాగుతున్న హంద్రీనీవా కాలువ వెడల్పు, లైనింగ్ పనులకు వర్షంతో ఆటంకం ఏర్పడింది. నెలరోజులుగా కాలువ పనులు చురుగ్గా సాగుతున్నాయి. నాలుగైదు రోజులుగా ఉరవకొండ నియోజకవర్గం, పైన కురిసిన భారీ వర్షాలకు హంద్రీనీవా కాలవ గట్టు కోతకు గురైంది. వర్షం నీరంతా కాలువలోకి చేరడంతో పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో హంద్రీనీవా అధికారులు, కాంట్రాక్టర్లు పనులను నిలిపేశారు. జూన్ ఆఖరుకు పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో హంద్రీనీవా ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు వేగం పెంచారు. ఈ తరుణంలో వర్షం ఆటంకిగా మారింది. రెండు రోజులుగా క్షేత్రస్థాయిలో పనులను జలవనరుల శాఖ ప్రాజెక్ట్‌ల సీఈ నాగరాజ, హం ద్రీనీవా ఎస్ఈ రాజా స్వరూప్‌కుమార్ పరిశీలిస్తున్నారు. సీఈ మా ట్లాడుతూ.. కాలువలోకి చేరిన వర్షం నీటిని భారీ మోటార్లతో బయటకు తోడేస్తున్నామనీ, రెండు, మూడు రోజుల్లో పనులను ప్రారంభిస్తామన్నారు. గడువు లోపు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

విరివిగా చెక్‌డ్యాంలు

● రూ.12.13 కోట్లతో 239 నిర్మాణం
● ఇప్పటికే 90 పూర్తి
● రైతులకు బహుళ ప్రయోజనాలు
● పశువులు, పక్షుల దాహార్తికి పరిష్కారం


వెస్ట్ నరసాపురం వద్ద నిర్మించిన చెక్‌డ్యాంలో నీటిని తాగుతున్న గొర్రెలు

అనంతపురం క్లాక్‌టవర్, మే 19(ఆంధ్రజ్యోతి): ప్రతి వర్షపు నీటి చుక్కను ఒడిసిపట్టి.. భూమిలోకి ఇంకింపచేయడానికి చెక్‌డ్యాంలు ఎంతో ఉపయోగపడుతాయి. రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని ఎంపిక చేసిన ప్రదేశాల్లో చెక్‌డ్యాంలు నిర్మించాలని ప్రభుత్వం నిర్దేశించింది. వాటర్‌షెడ్ పథకం కింద 2024-26 సంవత్సరం కాలంలో జిల్లాలో 239 చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ.12.13 కోట్లు నిధులు కేటాయించారు. ఒక్కో చెక్‌డ్యాం 13,500 క్యూబిక్ మీటర్ల పరిధిలో నిర్మిస్తున్నారు. చెక్‌డ్యాంలో సుమారు 1.35 లక్షల లీటర్ల నీటిని నిల్వచేయవచ్చు. జిల్లా వ్యాప్తంగా 239 చెక్‌డ్యాంల నిర్మాణం పూర్తి చేస్తే సుమారు 3.22 కోట్ల లీటర్ల నీటిని నిల్వచేసే అవకాశం ఉంది. ఇప్పటి వరకు 90 చెక్‌డ్యాంలు నిర్మించారు. రూ.3.24 కోట్లు ఖర్చు చేశారు. మిగిలిన 149 చెక్‌డ్యాంలను వచ్చే సీజన్‌నాటికి పూర్తి చేయడానికి వాటర్‌షెడ్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

చెక్‌డ్యాంతో బహుళ ప్రయోజనాలు

వాగులు, వంకల్లో నీటి ప్రవాహాన్ని, వర్షపు నీటిని నిలిపేందుకు, భూమిలోకి ఇంకింపచేసేందుకు అనువుగా చెక్‌డ్యాంలు నిర్మిస్తారు. వేగంగా వచ్చే నీటి ప్రవాహాన్ని తగ్గించి, వంక కోతకు గురికాకుండా అరికడుతుంది. భూగర్భజలాలు పెంచి, చుట్టుపక్కల రైతుల బోరు బావుల్లో నీటిమట్టం పెరుగుతుంది. దీంతో నీటి లభ్యతపెరిగి నిరంతరం పంటలు సాగుచేసుకోవచ్చు. పశువులు, పక్షులకు తాగునీరు, పంట పొలాలకు మందుల పిచికారికి నీరు లభిస్తుంది.

చెక్‌డ్యాంలతో రైతులకు మేలు

వాగులు, వంకల్లో నీటి నిల్వ చేసి నిర్మించే చెక్‌డ్యాంలతో రైతులకు, పొలాలకు ఎంతో మేలు జరుగుతుంది. జిల్లాకు కేటాయించిన 239 చెక్‌డ్యాంలకు గాను ఇప్పటి వరకు 90 పూర్తి చేశాం. రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని నిర్మిస్తున్నాం. వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపచేసి, భూగర్భ జలాలను పెంచుకోవచ్చు. వేసవిలో అనేక ప్రయోజనాలు కలుగుతాయి.

-సుధాకర్‌రెడ్డి, ఏపీడీ, వాటర్‌షెడ్

వ్యవసాయ శాఖలో బదిలీలకు శ్రీకారం

● దరఖాస్తు చేసుకోవాలని ఉత్తర్వులు
● ఇప్పటి దాకా ఆన్‌లైన్ ఆప్షన్ ఇవ్వని వైనం



అనంతపురం అర్బన్, 19(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖలో బదిలీలకు శ్రీకారం చుట్టారు. గత ఏడాది వ్యవసాయ శాఖలో బదిలీలు జరగలేదు. దీంతో అప్పట్లో ఆ శాఖ అధికారులు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. ఈ ఏడాది ఇతర శాఖలతో పాటు వ్యవసాయ శాఖలో బదిలీలకు అవకాశం ఇవ్వడంతో ఆ శాఖ అధికారులు, సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లు పూర్తయిన అధికారులు తప్పనిసరిగా బదిలీకి దరఖాస్తు చేసుకోవాలని నిబంధన విధించారు. ఐదేళ్లలోపు కాల పరిమితి ఉన్న అధికారులు, సిబ్బందికి దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. వ్యవసాయ శాఖలో ఈనెల 28వతేదీలోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈనెల 25వతేదీ సాయంత్రం 5 గంటల్లోపు సీనియర్ అసిస్టెంట్లు, ఏఓలు, ఏడీఏలు ఆన్‌లైన్‌లో బదిలీల కోసం ఆప్షన్లు ఇవ్వాలని గడువు విధించారు. ఈనెల 26న అనంతపురం జేడీఏ కార్యాలయంలో జోన్-5 పరిధిలోని జిల్లాల జేడీఏలు అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు ఉమ్మడి జిల్లాల జేడీఏలు కౌన్సిలింగ్‌కు హాజరుకానున్నారు. సీనియర్ అసిస్టెంట్లు, ఏఓలు, ఏడీఏలు ఆన్‌లైన్‌లో ఇచ్చిన ఆప్షన్‌ను పరిశీలించి, కమిషనరేట్‌కు పంపుతారు. ఏఈఓలు, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర కిందిస్థాయి సిబ్బంది బదిలీలు జేడీఏ ఆధ్వర్యంలోనే నిర్వహిస్తారు. ఆయా సిబ్బందికి కౌన్సెలింగ్ తేదీని ఇంకా ఖరారు చేయలేదు. ఇప్పటి దాకా ఆన్‌లైన్‌లో బదిలీల స్థానాలకు ఆప్షన్ ఇచ్చేందుకు సదుపాయం కల్పించలేదు. దీంతో అధికారులు, సిబ్బంది నిరీక్షిస్తున్నారు. దీనిపై జేడీఏ ఉమామహేశ్వరమ్మను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా బదిలీ ప్రక్రియ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

హాస్టల్ వర్కర్ దర్జా

● విద్యార్థులతో మసాజ్ ● సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్



ఉరవకొండ, మే19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహంలో హాస్టల్ వర్కర్ మోహన్.. విద్యార్థులతో మసాజ్ చేయించుకుంటున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఆలస్యంగా వీడియో వెలుగులోకి వచ్చింది. వేసవి సెలవులకు ముందు హాస్టల్లోని విద్యార్థులతో తరచూ మోహన్ మసాజ్ చేయించుకునేవాడని తెలిసింది. వసతి గృహంలో మరుగుదొడ్లను శుభ్రం చేయించడమే కాకుండా విద్యార్థులను దుర్భాషలాడేవాడని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. విషయం ఏఎస్‌డబ్ల్యూఓ, హాస్టల్ వార్డెన్ దృష్టికి తీసుకెళ్లినా, పట్టించుకున్న దాఖలాల్లేవన్నారు.

వర్కర్ మోహన్‌పై చర్యలు తీసుకోవాలి

విద్యార్థులతో మసాజ్ చేయించుకున్న హాస్టల్ వర్కర్ మోహన్‌పై చర్యలు తీసుకోవాలని పీఎస్ఎఫ్ఐ జిల్లా నిర్వాహక కమిటీ అధ్యక్షుడు హిరణ్య డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం పీఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ.. హాస్టల్ విద్యార్థులతో మసాజ్ చేయించుకున్న విషయం ఏఎస్‌డబ్ల్యూఓ, వార్డెన్ దృష్టికి తీసుకెళ్లినా, చర్యలు తీసుకోలేదన్నారు. వర్కర్‌నే అధికారులు వెనకేసుకొచ్చారన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏఎస్‌డబ్ల్యూఓ రామ్మోహన్, హాస్టల్ వార్డెన్ జగన్నాథ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశా రు. కార్యక్రమంలో పీఎస్ఎఫ్ఐ నాయకులు దయాచరణ్, హరిచరణ్ పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి చొరవ చూపండి

● జిల్లా న్యాయాధికారి భీమారావు


అధికారులతో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి

అనంతపురం క్రైం, మే 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల పరిధిలో జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి చొరవ చూపాలని జిల్లా న్యాయాధికారి భీమారావు పేర్కొన్నారు. సోమవారం జిల్లా న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ ఉమ్మడి జిల్లాకు చెందిన రెవెన్యూ, పోలీస్ అధికారులతో సమావేశమయ్యారు. అధిక సంఖ్యలో సమస్యలు పరిష్కారం కావడానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. కేసుల పరిష్కారం విషయంలో ఏవైనా సందేహాలుంటే డీఎల్ఎస్ఏ కార్యదర్శిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీలు జగదీష్, రత్న, అనంతపురం జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళా హోంగార్డును సత్కరించిన ఎస్పీ

అనంతపురం క్రైం, మే 19(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన మహిళా హోంగార్డు కృష్ణవేణిని జిల్లా ఎస్పీ జగదీష్ సోమవారం ఘనంగా సన్మానించారు. ఎస్పీ తన చాంబర్లో ఆమెను సన్మానించారు. పోలీస్‌శాఖకు అనుబంధంగా చేరి మంచి సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఆర్ఎస్ఐ జాఫర్, ఏఆర్ఎస్ఐలు, హోంగార్డులు పాల్గొన్నారు.

పీఎస్ఓలకు శిక్షణ

జిల్లాలోని పీఎస్ఓలకు(గన్ మెన్)లకు రెండ్రోజుల పాటు రిఫ్రెష్ కోర్సులు ప్రారంభమయ్యాయి. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి కోర్సులను ప్రారంభించారు. స్థానిక డీటీసీలో ఈ కోర్సులను నిర్వహించనున్నారు. ఫిట్‌నెస్, ముందస్తు జాగ్రత్తలు, డూస్ డోంట్స్, వెపన్‌పై పరిజ్ఞానం, ఫైరింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. విజయవాడ ఐఎస్‌డబ్ల్యు విభాగం నుంచి విచ్చేసిన ఆర్ఐ శ్రీనివాసరావు మెలకువలు, సూచనలు చేశారు.

22న బైక్‌ల వేలం

అనంతపురం క్రైం, మే19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 22న ద్విచక్రవాహనాలను వేలం వేయనున్నట్లు సీఐ శ్రీకాంత్ తెలిపారు. 27 బైక్‌లను వేలం వేస్తామన్నారు. ఆసక్తి కలవారు రూ.2 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

న్యూస్ బాక్స్

పది ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలు

అనంతపురం కల్చరల్, మే 19(ఆంధ్రజ్యోతి) : హనుమాన్ జయంతి వేడుకలను టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా పది ఆంజనేయ స్వామి ఆలయాల్లో ఈనెల 22న వేడుకలు నిర్వహించనున్నట్లు పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ బాబు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణమండపంలో హనుమాన్ జయంతి కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పండిట్ వేణు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నీలం సేవలు మరువలేనివి

● జయంతి వేడుకలలో వక్తలు



కల్లూరులో నివాళులర్పిస్తున్న నాయకులు, గ్రామస్థులు

అనంతపురం న్యూటౌన్, మే 19(ఆంధ్రజ్యోతి) ప్రాజెక్టుల రూప కర్త మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి అని ఏపీఐడీసీ మాజీ చైర్మన్ నల్లపరెడ్డి కొనియాడారు. నీలం సంజీవరెడ్డి జయంతి సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీకంఠం సర్కిల్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పెద్ద ఎత్తున పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నల్లపరెడ్డితో పాటు, జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు మాజీ చైర్మన్ వెన్నుపూస రామచంద్రారెడ్డి, నాయకులు ఆదినారాయణరెడ్డి, గౌస్, సుధాకర్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● గార్లదిన్నె: మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి దేశానికి చేసిన సేవలు మరువలేనివని బుక్కచెర్ల నల్లపరెడ్డి, సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కల్లూరులో నీలం సంజీవరెడ్డి 112వ జయంతి వేడుకలను సోమవారం నీలం సంజీవరెడ్డి అభిమాన సంఘం నాయకులు ఏకే నరసింహులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని నీలం సంజీవరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి, కేక్ కట్‌చేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామస్థులు సుధాకర్‌రెడ్డి, బుక్కచెర్ల నల్లపరెడ్డి, పెద్దన్న, చంద్రనాథ్‌రెడ్డి, కల్లూరి ఓబిరెడ్డి, ఆదినారాయనరెడ్డి, పుల్లారెడ్డి, గంగాధర్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యంపై నిఘా పెంచండి

● ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

చెన్నేకొత్తపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యం రవాణా కాకుండా నిఘా పెంచాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య సూచించారు. చెన్నేకొత్తపల్లిలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని ఆయన సోమవారం తనిఖీ చేశారు. పలు విషయాలపై ఎక్సైజ్ సీఐ ఫరూక్‌అజంను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమం కింద నాటుసారా నిర్మూలనకు గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. నాటుసారా, అక్రమ మద్యానికి సంబంధించి పాత నేరస్థుల మీద ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వం మద్యం దుకాణాలలో ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్మితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్ ఉన్నారు.

దుకాణాల ఎదుట చెత్త వేస్తే చర్యలు: కమిషనర్

అనంతపురం క్రైం, మే 19(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో దుకాణాల ఎదుట చెత్త వేస్తే చర్యలు తప్పవని నగర కమిషనర్ బాలస్వామి హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చెత్త అలా వేయడం వలన ప్రజల ఆనారోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. ఇప్పటికే దుకాణదారులకు సూచించామని పేర్కొన్నారు. ఇకపై అలా కనిపిస్తే సబంధికులకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడి ఎంపిక

అనంతపురం రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని నరసనాయునికుంట టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా వేలూరి రవీంద్ర మరోసారి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం రవీంద్రను మండల మాజీ కన్వీనర్ లక్ష్మీనారాయణ తదితరులు సన్మానించారు. కార్యక్రమంలో సత్యసాయి జిల్లా కుమ్మర శాలివాహన సాధికార సమితి అధ్యక్షుడు రామాంజినేయులు, టీడీపీ నాయకులు వెంకట్ చౌదరి, అనిల్‌చౌదరి, సజ్జలకాలువ రాము, ఎల్లప్ప, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని కూలీ మృతి

● మృతుడు మధ్యప్రదేశ్ వాసి

చెన్నేకొత్తపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాదిండి గ్రామ సమీపంలో సోమవారం ప్రమాదవ శాత్తు రైలు ఢీకొని ఓ రైల్వే కూలీ మృతిచెందాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన ముఖేష్ సింగ్(25) రైల్వే పనుల నిమిత్తం ఇక్కడికి వచ్చాడు. ప్యాదిండి వద్ద పగలు పనులు ముగించుకున్నాడు. రాత్రి ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొనడంతో మృతిచెందినట్టు హిందూపురం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మురళి తెలిపారు. సంఘటనాస్థలాన్ని పరిశీలించి అతడి తండ్రి శ్యాంబహదూర్‌సింగ్‌కు సమాచారం అందించామన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భూసార పరీక్షలపై శిక్షణ తరగతులు

● ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ

అనంతపురం సెంట్రల్, మే 19(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షల నిర్వహణపై ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ పేర్కొన్నారు. సోమవారం కళాశాలలోని రసాయనశాస్త్ర విభాగంలో విద్యార్థులకు శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మశ్రీ మాట్లాడుతూ ఏరీస్ ఆగ్రో కెమికల్స్ సంస్థతో భూసార పరీక్షలపై అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఇందులో వివిధ వ్యవసాయ క్షేత్రాలనుంచి సేకరించిన మట్టి నమూనాలను కళాశాలకు తీసుకొచ్చి ల్యాబ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగం అధ్యాపకులు జితేంద్ర, నర్సింహారెడ్డి, సంస్థ ప్రతినిధులు శ్రీనివాసులు నాయుడు, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పీర్లచావిడి నిర్మాణానికి విరాళం

అనంతపురం రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోములదొడ్డి గ్రామంలో పీర్లచావిడి నిర్మాణానికి టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి తన వంతుగాత విరాళం ఇచ్చారు. సోమవారం పాములరాయిలో పీర్ల చావిడి కమిటీ సభ్యులకు రూ.10,116 అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మంత్రి నాగన్న, రామచంద్ర, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



విరాళం ఇస్తున్న టీడీపీ నాయకుడు రఘు

మినీ మహానాడును విజయవంతం చేద్దాం

● ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
● నేడు కమ్మభవన్‌లో నిర్వహణ
● ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, 19(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అర్బన్ నియోజకవర్గం మినీ మహానాడును విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పిలుపునిచ్చారు. అర్బన్ నియోజకవర్గం మినీ మహానాడును మంగళవారం ఉదయం 10 గంటలకు నగరంలోని కమ్మభవన్‌లో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సోమవా రం పలువురు నాయకులతో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ కమ్మభవన్‌లో మినీమహానాడు ఏర్పాట్లను పరిశీలించారు. అంతకు ముందు ఆయన పార్టీ అర్బన్ కార్యాలయంలో పలువురు ముఖ్యనాయకులతో మినీమహానాడు నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ... గత రెండేళ్లల్లో మరణించిన వారికి మినీ మహానాడులో సంతాపం తెలపాలని తీర్మానించామన్నారు. అనంతపురం అర్బన్‌లో పార్టీ పరంగా భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలను ప్రకటిస్తామన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకువెళ్లేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సూచించారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత తొలి మినీ మహానాడు కావడంతో నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, అన్ని విభాగాల నాయకులు పెద్దఎత్తున హాజరుకావాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ బ్యాంక్ చైర్మన్ జేఎల్ మురళి, మాజీ మేయర్ స్వరూప, నాయకులు ఎద్దు లపల్లి సుబ్రహ్మణ్యం, తలా రి ఆదినారాయణ, బుగ్గ య్య చౌదరి, గాజుల ఆదెన్న, గంగారామ్, కొండవీటి భావన, స్వప్న, సంగా తేజస్విని, రాయల్ మురళి, సుధాకర్ నాయుడు, సరిపూటి రమణ, కుంచెపు వెంకటేష్, సిమెంట్ పోలన్న, సాలార్ బాషా, సింగవరం రవి, సైఫుద్దీన్, ఫిరోజ్ అహ్మద్, ముక్తియార్, చేపల హరి, పరమేశ్వరన్, పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న, నెట్టెం బాలకృష్ణ, మణికంఠబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు గార్లదిన్నెలో శింగనమల మినీ మహానాడు

● మర్తాడు క్రాస్ వద్ద టి - కన్వెన్షన్ హాల్‌లో...
● ఏర్పాట్లపై సమీక్షించిన ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

బుక్కరాయసముద్రం/గార్లదిన్నె, మే 19(ఆంధ్రజ్యోతి): శింగనమల నియోజకవర్గం మినీ మహానాడు కార్యక్రమాన్ని కలిసికట్టుగా విజయవంతం చేద్దామని పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పిలుపునిచ్చారు. అనంతపురం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం ఎమ్మెల్యేతో పాటు ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి కలిసి నియోజకవర్గంలోని ఆరు మండలాల పార్టీ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో మినీ మహానాడుపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమాన్ని విజయవంతంతో పాటు, మినీ మహానాడులో చేపట్టాల్సిన తీర్మానాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మినీ మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామన్నారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి ప్రణాళిక, కార్యకర్తల సంక్షేమం, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల అమలు తీరుపై మినీ మహానాడులో తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో టీడీపీ పార్టీ కార్యకర్తల మృతి పట్ల సంతాపం తెలుపనున్నట్లు తెలిపారు. మినీహానాడును విజయవంతం చేసేందుకు కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, క్లస్టర్, గ్రామ యూనిట్ ఇన్‌చార్జ్, పార్టీ నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్లు అశోక్‌కుమార్, గుత్తా ఆదినారాయణ, బాల రంగయ్య, పాండు, ఎర్రినాగప్ప, రామాంజినేయులు, ఆరు మండలాల క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు. అనంతరం మినీ మహానాడును గార్లదిన్నె మండల పరిధిలోని మర్తాడు క్రాస్ వద్ద నున్న టి - కన్వెన్షన్ హాల్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు మినీమహానాడు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మినీమహానాడు ఏర్పాట్లుకు సంబంధించి సోమవారం ఎమ్మెల్యేతో పాటు ఏడీసీసీ చైర్మన్ కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, రామలింగారెడ్డి, పసుపుల శ్రీరామిరెడ్డి, గేట్ క్రిష్టారెడ్డి తదితర నాయకులు టి - కన్వెన్షన్ హాల్ వద్ద పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీసీ చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు, నాయకులు పాండు, జయరాం, గుత్తా బాలకృష్ణ, నరసింహారెడ్డి, ఈశ్వరయ్య, గుర్రం శీనా, అంజి, పవన్, సుబ్బు, శేఖర్, చల్లా నాగరాజు, గుత్తా హరి, పరశురామ్, దాసరి శీన తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లపై నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్

జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

● సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

అనంతపురం విద్య, మే 19(ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ పిలుపునిచ్చారు. ఆయన సోమవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జూలై 25, 26, 27 తేదీల్లో జిల్లా కేంద్రంలో సీపీఐ జిల్లా మహాసభలు జరుగుతాయన్నారు. 1925లో సీపీఐని స్థాపించిన్పటి నుంచి నేటి వరకు వేల ఎకరాల బంజరు, మిగులు భూములు, భూస్వాముల చేతుల్లో కబ్జా అయిన భూములకు విముక్తి కల్పించి పేదలకు అందించడంలో సీపీఐ కీలక భూమిక పోషించిందన్నారు. జూలైలో జరిగే జిల్లా మహాసభలకు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, రాజారెడ్డి, కేశవరెడ్డి, రాజేష్‌గౌడ్, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐ హసీనాబానుపై చర్యలు తీసుకోండి

● కలెక్టర్‌కు నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కడియాల కొండన్న

అనంతపురం అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తున్న నానిపై చెప్పుతో దాడి చేసిన ఆ స్టేషన్ సీఐ హసీనాబానుపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కు మార్ను నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కడియాల కొండన్న కోరారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు పుల్లలరేవు లింగమ య్య, శివాంజినేయులు, చిన్నకుళ్లాయప్పతో కలిసి ఆయన సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఎక్సైజ్ సీఐపై తక్షణమే కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని కోరారు. ఇలాగే మద్యం వ్యాపారుల నుంచి అక్రమ వసూళ్లపై క్షేత్ర స్థాయిలో విచారణ చేసి ఆమెను సస్పెండ్ చేయాలని కోరారు.

సస్పెండ్ చేయాలి..

● అనంతపురం విద్య: కళ్యాణదుర్గం ఎక్సైజ్ సీఐని సస్పెండ్ చేయాలని నాయీ బ్రాహ్మణ వృత్తిదారుల సమాఖ్య, ఏపీ చేతి వృత్తిదా రుల సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ కార్యాలయంలో ఆయా సంఘాల నేతలు సమావేశం నిర్వహించారు. ఏపీ చేతి వృత్తి దారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు లింగమయ్య, జిల్లా కార్యదర్శి హరికృష్ణ, నాయీ బ్రాహ్మణ వృత్తిదారుల సమాఖ్య నగర అధ్యక్షులు గోవిందరాజులు మాట్లాడారు. అటెండర్‌పై సీఐ చెప్పుతో దాడి చేయడం దారుణం అన్నారు. ఆమెను సస్పెండ్ చేయకుండా బదిలీల చేయడం దారుణం అన్నారు. వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

90 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలివ్వాలి: సీపీఐ

శింగనమల, మే 19(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ సాగుకోసం వేరుశన విత్తనకాయలను ప్రభుత్వ రైతులకు 90 శాతం సబ్సిడీతో పంపిణీ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ముదుయాదవ్ డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై సోమవారం శింగనమల తహసీ ల్దార్ కార్యాలయంలో సీపీఐ ఆధ్వర్యంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఇప్పటికే రైతులు ఖరీఫ్ వేరుశన సాగుకు సిద్ధమయ్యారిని అన్నారు.

మెస్ బిల్లుల స్వాహాపై చర్యలు తీసుకోవాలి

● ఏఐఎస్ఎఫ్ డిమాండ్



ఆందోళన నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

అనంతపురం టౌన్/ విద్య, మే 19(ఆంధ్రజ్యోతి): మెడికోలు నెలానెలా మెస్ కోసం చెల్లించే సొమ్మును స్వాహాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం మెడికల్ కళాశాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు హనుమంతరాయుడు, ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి మాట్లాడుతూ.... విద్యార్థులు మెస్ కోసం చెల్లిస్తున్న సొమ్మును అకౌంటెంట్ ఖాతాకు వేసుకున్నారనే ఆరోపణలు వచ్చినా, కళాశాల ప్రిన్సిపాల్ ఎందుకు పోలీసులకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. స్వాహా చేసినవారిని రక్షించేందుకు పై అధికారులే విచారణ పేరుతో ప్రయత్నిస్తున్నారే అనుమానాలు వస్తున్నాయన్నారు. ఇక్కడి విద్యార్థులు డబ్బులు స్వాహా చేసిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజ్‌లో జరుగుతున్న అక్రమాలపై కలెక్టర్, రాష్ట్ర స్థాయి వైద్యశాఖాధికారులు దృష్టి సారించాలని కోరా రు. లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందుకు ప్రిన్సిపాల్ స్పందిస్తూ విచారణ ముగిసిందని పరిశీలించిన అనంతరం తప్పకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మంజునాథ్, నాని, సమీర్, పవన్, బాబ్జాన్, ప్రవీణ్, కార్తీక్, తౌసిఫ్, ఉమేష్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద మెడికల్ రెప్స్ ఆందోళన

● దాడిచేసిన ఏజెన్సీ ఓనర్‌పై చర్యలకు డిమాండ్

అనంతపురం టౌన్/ విద్య, మే 19(ఆంధ్రజ్యోతి): మెడికల్‌రెప్‌పై దాడిచేసిన మెడికల్ ఏజెన్సీ ఓనర్‌పై చర్యలు తీసుకోవాలని మెడికల్ రెప్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మెడికల్ రెప్ మిద్దె చంద్రపై అనంతపురం నగరంలోని ఓ మెడికల్ ఏజెన్సీ ఓనర్ దాడిచేశారని చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టరేట్ వద్ద రెప్స్ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆసంఘం నాయకులు మనోహర్, చంద్ర, అమర్, నరేంద్ర తదితరులు మాట్లాడుతూ... మెడికల్ రెప్‌పై దాడిచేసిన ఓనర్‌పై చర్యలు తీసుకునే వరకు ఇక్కడి నుంచి వెళ్లమని కూర్చున్నారు. దీంతో పోలీసులు దాడిచేసి కొట్టిన ఏజెన్సీ ఓనర్‌ను అక్కడకు పిలిపించి చర్చించారు. అతడు క్షమాపణ చెప్పగా ఆందోళన విరమించారు.

'కేఎస్ బాబు విగ్రహాన్ని పునఃస్థాపించాలి'

అనంతపురం సెంట్రల్, మే 19(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల పాటు దళిత వర్గాలకోసం చేసిన పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిన ఎమ్మార్పీఎస్ నాయకుడు కేఎస్ బాబు విగ్రహాన్ని పునఃస్థాపించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌ను ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ అక్కులప్ప కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. 2011లో కలెక్టరేట్ ఎదురుగా కేఎస్‌బాబు విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించిన విగ్రహాన్ని నేటికీ పునఃస్థాపించలేదన్నారు.

ప్రజల ప్రాణాలు పోతేగాని స్పందించరా..!

● ప్రజాశక్తి కాలనీలో విద్యుత్ సమస్యను పరిష్కరించండి
● సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా



విద్యుత్‌శాఖ ఉద్యోగికి వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): కరెంటు షాక్‌తో ప్రజలు పోతేగాని సంబంధిత అధికారులు స్పందించేలా లేరని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి అన్నారు. మండలంలోని కక్కలపల్లి గ్రామ ప్రజాశక్తి కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలంటూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక సబ్‌స్టేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేపటారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ... కొన్నేళ్లుగా ప్రజాశక్తి కాలనీలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఇళ్లలోని గోడలకు, ఇనుప వస్తువులకు కరెంటు సరఫరా అవుతోందన్నారు. స్థానికంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యానికి మించి కనెక్షన్లు ఉండటం చేత సమస్య తలెత్తుతోందన్నారు. మూడురోజుల కిందట కురిసిన వర్షానికి ఇళ్లలో గోడలకు విద్యుత్ సరఫరా అయి పిల్లలు, పెద్దలు షాక్‌కు గురయ్యారన్నారు. ప్రజలకు ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. విద్యుత్ అధికారులు, సిబ్బందికి కాలనీవాసులు ఫోన్ చేసినా స్పందించడం లేదన్నారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను, విద్యుత్ లైన్‌ను మార్చాలన్నారు. ఇదే సందర్భంగా సంబంధిత ఏఈతో మాట్లాడి, ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటనారాయణ, ఇర్ఫాన్, మసూద్, లతీఫ్, రాజు, గఫూర్, రామాంజి కాలనీ వాసులు శ్రీనివాసులు, గోపాల్, అల్లాప్రకాష్, వార్డు సభ్యురాలు ఆదెమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్లపై తట్టెడు మట్టి వేయించలేని

అసమర్థుడు తోపుదుర్తి

● ఎమ్మెల్యే పరిటాల సునీత విమర్శ
● బాలేపాళ్యం- నెమలివరం తారురోడ్డు ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామీణ రోడ్లపై ఏర్పడిన గుంతలకు తట్టెడు మట్టి వేయించుకోలేని అసమర్థుడు తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి అని ఎమ్మెల్యే పరిటాల సునీత ఎద్దేవ చేశారు. కనగానపల్లి మండలపరిధిలోని బాలేపాళ్యం- నెమలివరం గ్రామాల మధ్య ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ. 2కోట్లు నిధులతో నూతనంగా నిర్మించిన తారురోడ్డును సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కొన్నేళ్లుగా సరిగా రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడే వారమని ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రోడ్డు వేసి తమ సమస్య పరిష్కరించారని ఎమ్మెల్యే వద్ద గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఈ గ్రామానికి రోడ్డు సమస్య ఉందని అప్పటి సర్పంచ్ లక్ష్మీనారాయణ గతంలో చాలా సార్లు తన దృష్టికి తెచ్చారన్నారు. ప్రస్తుతం ఆయన మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు వేసి గ్రామానికి వచ్చానన్నారు. గత వైసీపీ పాలనలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి టీడీపీ సానుభూతి పరులున్న గ్రామాల్లో గుంతలు పడ్డ రోడ్లకు కనీసం మట్టికూడా వేయలేదని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గంలో ఎక్కడ రోడ్డు సమస్య లేకుండా చేస్తున్నామన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్ డీఈ నారాయణస్వామి, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ అనిల్‌కుమార్ డీసీసీ చైర్మన్ నెట్టెం వెంకటేష్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ సుధాకర్‌చౌదరి, టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతులయ్య, మాజీ ఎంపీపీ ముకుందనాయుడు, మాజీ జడ్పీటీసీ బిల్లే ఈశ్వరయ్య పాల్గొన్నారు.

అనంత రాముడికి తెలుగువన్ స్ఫూర్తి పురస్కారం



ముఖ్య అతిథుల నుంచి అవార్డును స్వీకరిస్తున్న అనంతరాముడు

అనంతపురం సెంట్రల్, మే 19(ఆంధ్రజ్యోతి): అనంతలక్ష్మి విద్యా సంస్థల చైర్మన్ అనంత రాముడు జిల్లాలో 1996 నుంచి వ్యవసాయ రంగంలో రాణిస్తున్నారు. సాధారణ పంటల నుంచి బొప్పాయి, మామిడి నుంచి దానిమ్మ వరకు పది రకాల పంటల పండ్ల తోటల ఆవిష్కరణకు వేదికగా నిలిచారు. జిల్లా పండ్ల తోటల రైతుల సంఘం అధ్యక్షుడిగా చురుకుగా పనిచేస్తూ వ్యవసాయ నిపుణులుగా గుర్తింపు పొందారు. మరోవైపు అనంతలక్ష్మి విద్యా సంస్థల చైర్మన్‌గా సాంకేతిక విద్యనందిస్తున్నారు. ఈ విష్టసేవలకు గుర్తింపుగా అనంత రాముడిని వ్యవసాయ నిపుణుల విభాగంలో తెలుగువన్ స్ఫూర్తి పురస్కారం వరించింది. హైదరాబాద్‌లో జరిగిన పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ, త్రిదండి చినజీయర్ స్వామి, ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు చేతుల మీదుగా అనంతరాముడు స్ఫూర్తి పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా అనంతక్ష్మి విద్యాసంస్థల వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు, అధ్యాపక, అధ్యాపకేతర బృందంతో పాటు పలువురు వ్యవసాయ రంగ నిపుణులు అనంతరాముడిని అభినందించారు.

చిరస్మరణీయుడు పుచ్చలపల్లి సుందరయ్య

● సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో నివాళి



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం కల్చరల్, మే 19(ఆంధ్రజ్యోతి): పీడిత వర్గాల జీవన ప్రమాణాల్లో మార్పు, సమ సమాజం కోసం తుదిశ్వాస వరకు పోరాడిన పుచ్చలపల్లి సుందరయ్య చిరస్మరణీ యుడని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి పేర్కొన్నారు. భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, మొట్టమొదటి పార్లమెంట్‌లో ప్రతిపక్షనేత పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. నగరంలోని మల్లు స్వరాజ్యం నగర్‌లో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు వలి, మసూద్, ఇర్ఫాన్, నగర కమిటీ సభ్యులు ఎర్రిస్వామి, లక్ష్మీనారాయణ, ఏటీఎం నాగరాజు, లక్ష్మీనరసమ్మ, ఎన్టీఆర్ శీన, అశ్విని, గఫూర్, జేవీవీ నాయకులు తిరుపాల్, ఉపాధ్యాయులు గోవిందరాజులు, రమణయ్య, కోటేశ్వరప్ప, డేవిడ్, రాము, ఆది, శంషాద్, హాజీవలి, శంకర్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

● శింగనమల: కమ్యూనిస్టు మాజీ నేత పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా వ్యవసాయకార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. మండలంలోని ఆనందరావుపేటలో ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తరిమెల భాస్కర్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. సంఘం నాయకులు సుంకన్న, రామాంజినేయులు, లక్ష్మీనారాయణ, కేశన్న మునెప్ప పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి'

రాప్తాడు, మే 19(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీల మేరకు ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేయాలని సీపీఐ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. రాప్తాడులో స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సీపీఐ నాయకుల మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా జూన్2న తహసీల్దార్ కార్యాలయాల వద్ద సీపీఐ ధర్నా నిర్వహిస్తోందని, రాప్తాడులో కూడా నిర్వహిస్తామన్నారు.

'ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేయాలి'



ర్యాలీ పాల్గొన్న జేఏసీ నాయకులు, గ్రామస్థులు

నార్పల, మే 19(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయాలని సేవ్ ఆర్డీటీ జేఏసీ నాయకులు పేర్కొన్నారు. సేవ్ ఆర్డీటీ జేఏసీ నార్పల మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కొత్తబస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ వేదాంతం నాగరత్నమ్మ, కన్వీనర్ దుర్గం రామాంజినేయులు, కోకన్వీనర్ రంగాపురం పుల్లప్ప, సభ్యులు శివయ్య, సుధాకర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

● మినీ మహానాడులో ప్రభుత్వ విప్ కాలవ పిలుపు

రాయదుర్గం, మే 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకివిస్తృతంగా తీసుకెళ్లాలని ప్రభుత్వ విప్ కాల వ శ్రీనివాసులు తెలుగుదేశం నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పట్ట ణంలోని సీతారామాంజనేయస్వామి కల్యాణమంటపంలో సోమవారం జరి గిన మినీ మహానాడు సభకు ఆయన అధ్యక్షత వహించగా.. ముఖ్యఅతిథిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడుయాదవ్ హాజరయ్యారు. ముందుగా వారు వైసీపీ ప్రభుత్వ హయాంలో పార్టీ కోసం కేసులు పెట్టించుకుని ఇబ్బంది పడిన ఐదుగురు కార్యకర్తలకు ఒక్కొక్కరికి రూ. 50 వేల నగదును అందించారు. అనంతరం సభనుద్దేశించి కాలవ శ్రీని వాసులు మాట్లాడుతూ.. ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం పని చేసిన పార్టీ శ్రేణులకు, రాయదుర్గం ప్రజలకు రుణపడి ఉన్నానన్నారు. నియోజకవర్గ అభి వృద్ధికి శాయశక్తిలా కృషి చేస్తానన్నారు. ఆగిపోయిన పనులన్నింటిని పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. చంద్రబాబు సీఎం కాగానే పింఛన్‌ను రెట్టింపు చేసి ఆదుకున్నారన్నారు. అలాగే మెగా డీఎస్సీని ప్రక టించి 16 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడానికి శ్రీకారం చుట్టారన్నారు. సంవత్సరానికి మూడు గ్యాస్ సిలెండర్లను ఉచితంగా ఇచ్చే పథకాన్ని అమ లు చేసి ఇప్పటికే రెండు సిలిండర్లను ఇచ్చా ర న్నా ర ు. జూన్‌లో తల్లికి వం దనం ఇవ్వబోతు న్నారన్నారు. ఇక అన్నదాత సుఖీభ వను త్వరలోనే ఇవ్వబోతున్నారన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయా ణం సౌకర్యాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. వీటన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీని గెలుపించుకోవడం మనముందున్న లక్ష్యమని పేర్కొన్నారు. వెంకటశివుడుయాదవ్ మాట్లా డుతూ వైసీపీ విధ్వంస పాలన నుంచి విముక్తి లభించి ఏడాది కావస్తోంద న్నారు. అయినా ఆ గాయాలు ఇంకా కనిపిస్తున్నాయన్నారు. కేసులు పెట్టి పార్టీని, కార్యకర్తలను అణచివేయాలని కుట్ర పన్నినప్పటికీ వాటిని ఎదు ర్కొని ధైర్యంగా నిలిచామన్నారు. పార్టీ అభివృద్ధి కోసం అందరం ఐకమ త్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు వారు స్థానిక ఎన్ టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


మినీ మహానాడులో ప్రసంగిస్తున్న కాలవ శ్రీనివాసులు

సమష్టిగా విజయాలు సాధిద్దాం: గుమ్మనూరు

గుంతకల్లు, మే 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ ఒక్కతాటిపై నిలిచి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుగు లేని విజయాలను సాధిద్దామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పిలు పునిచ్చారు. పట్టణంలోని బలిజ కల్యాణ మండపంలో టీడీపీ నియోజక వర్గ మినీ మహానాడును నిర్వహించారు. ఇందులో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యేతో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పాల్గొ న్నారు. తొలుత వారు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలను వేసి నివాళు లర్పించారు. అలాగే వీర సైనికుడు మురళీ నాయక్ మృతికి మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. తర్వాత ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కోటి న్నర సభ్యత్వాలున్న పార్టీగా టీడీపీ దేశంలోనే ప్రథమస్థానంలో ఉంద న్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయ నిస్తోందన్నారు. నియోజవర్గంలో చేపడుతున్న హంద్రీనీవా వైడెనింగ్, రెన్యూ సోలార్ విద్యుత్ ప్రాజెక్టులతో రైతులకు ఎంతో మేలు జరుగుతుం దని, యువతకు సైతం ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ నిలుపుకుంటామని పేర్కొన్నారు. వెంక ట శివుడు యాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆధ్వర్యంలో పార్టీని బలోపేతం చేయడానికి అందరూ పాటుపడాల న్నారు. పనిచేసినవారందరికీ తప్పక గుర్తింపు లభిస్తుందన్నారు. అనం తరం ఈ సభలో వైటీ చెరువు నుంచి గుత్తి చెరువుకు నీరు వెళ్లేలా కాల్వ ను తవ్వాలని, హంద్రీనీవా నుంచి జీఎస్‌బీసీకి 200 క్యూసెక్కుల నీటిని అధికారికంగా ఇవ్వాలని, సహజంగా చనిపోయిన కార్యకర్తలకు ఆర్థిక సాయం అందించాలని, తదితర తొమ్మిది తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, నాయ కులు గుమ్మనూరు నారాయణ స్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు, కేసీ హరి, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు వెంకటే శులు, ప్రతాప్ నాయుడు, తలారి మస్తానప్ప, పాల మల్లికార్జున, కది రప్ప, రాయల రామయ్య, పత్తిహిమబిందు తదితరులు పాల్గొన్నారు.


మినీ మహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయరాం

పేద విద్యార్థినికి బద్దేనాయక్ ఆర్థిక సాయం

కళ్యాణదుర్గం, మే 19 (ఆంధ్రజ్యోతి): ఓ నిరు పేద విద్యార్థినికి పట్టణం లోని ఇన్ఫినిటీ చారిటబు ల్ ట్రస్ట్ చైర్మన్ బద్దేనా యక్ మాస్టర్ ఆర్థికసా యం చేసి ఆదుకున్నారు. మల్లేశ్వరి అనే విద్యార్థిని జీఎన్ఎం రెండో సంవత్స రం అనంతపురంలోని ఆ దర్శ నర్సింగ్ కాలేజీలో చదువుతోంది. తండ్రి చనిపోవడంతో నర్సిం గ్ ఫీజు కట్టలేక ఇంటి వద్దనే ఉంటోంది. విషయం తెలుసుకున్న బద్దేనాయక్ సో మవారం కళాశాలకే వెళ్లి ఆ విద్యార్థిని సంబంధించిన రూ. 25 వేలు ఫీజు ను ప్రిన్సిపాల్ యామినికి అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ సురేష్ కుమార్, సభ్యులు తిప్పేస్వామి, రాము, చిరంజీవి ఉన్నారు.


కళాశాల ప్రిన్సిపాల్‌కు నగదును అందచేస్తున్న బద్దేనాయక్ మాస్టర్

22న కౌలు రైతుల సదస్సు

విడపనకల్లు, మే 19(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ పట్టణంలో ఈ నెల 22వ తేదీన కౌలు రైతుల సదస్సు జరగనుందని, విజయవంతం చేయా లని ఏపీ కౌలు రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మండ లంలోని పలు గ్రామాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. తొలుత మండలకేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో పుచ్చల పల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. అనంతరం మండలకేంద్రంతో పాటు వేల్పుమడుగు, మాళా పురం, కరకముక్కల తదితర గ్రామాల్లో పర్యటించి కౌలు రైతుల సదస్సుపై ప్రచారం చేశారు. నియోజకవర్గంలో మిరప పంటను పండించే కౌలు రైతులు నష్టాల పాలవుతున్నారన్నారు. వీరిని ఏ ప్రభుత్వం ఆదుకోవడం లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలని కోరుతూ, పలు సమస్యలపై చర్చించేందుకు ఉరవకొండలోని వాల్మీకి కల్యాణమంట పంలో ఈ నెల 22న కౌలు రైతుల సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. రైతులు వేల సంఖ్యలో తరలి రావాలని కోరారు. ప్రాంతీయ కార్యదర్శి రంగారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి టీడీపీ నాయకుల పరామర్శ

గుత్తి, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడుకు టీడీపీ నాయకుడు రామచంద్ర యాదవ్ కుమారుడు మహేంద్ర అప్పులబాధ తాళలేక గత ఆదివారం ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అతడి మృతదేహాన్ని గుత్తిప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం టీడీపీ జిల్లా అధ్య క్షుడు వెంకటశివుడుయాదవ్, ఎమ్మెల్యే తనయుడు ఈశ్వర్ సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అతడి కుటుంబాన్ని పరామర్శించారు.

ఆర్థిక సాయం అందజేత

గుంతకల్లుటౌన్, మే 19(ఆంధ్రజ్యోతి): పట్ట ణంలోని సీఐటీయూ కా లనీలో నివాసముంటు న్న రాణి అనే మహిళకు వైసీపీ నాయకుడు దాస రి హరి శనివారం రూ.5 వేలు ఆర్థిక సాయం అం దజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది రోజుల క్రితం రాణి ఇంట్లో జరిగిన అగ్నిప్రమాదంలో సామగ్రి, దుస్తులు కాలిపోయా యన్నారు. ఇందుకు వైసీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి ఆదేశాల మేరకు బాధితురాలు రాణికి తన వంతుగా రూ. 5వేలు అందజేశామ న్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న దాసరి హరి

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కళ్యాణదుర్గం రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మానిరేవు సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. కాలవపల్లి తండాకు చెందిన భాను నాయక్, కూడేరుకు చెందిన స్నేహితుడు చిన్న(20)తో కలిసి బైక్‌పై ఆత్మకూరు మండలం కాలవపల్లి తండాలో పెళ్లికి బయలుదేరారు. మానిరేవు వద్దకు రాగానే గుర్తుతెలియని వాహనం ఢీ కొంది. ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు గమనించి హుటాహుటిన అనం తపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చిన్న దారి మధ్యలోనే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భాను నాయక్ పరిస్థితి విషమంగా ఉంది. సంఘటనా స్థలాన్ని కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేదల పక్షపాతి పుచ్చలపల్లి సుందరయ్య

● కొనియాడిన వక్తలు ● వర్ధంతి సందర్భంగా ఘన నివాళి

కళ్యాణదుర్గంరూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): సీపీఎం తొలి ప్రధాన కార్యదర్శి పుచ్చలపల్లి సుం దరయ్య పేదల పక్షపాతి అని వక్తలు కొనియాడా రు. ఆయన 40వ వర్ధంతిని పట్టణంలో సోమ వారం సీఐటీయూ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీరామిరెడ్డి పంపుహౌస్ వద్ద ఆయన చిత్రపటానికి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షు లు ఓబులు, అచ్యుత్‌ప్రసాద్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడు తూ.. సుందరయ్య అగ్రకుల భూస్వామ్య కుటుం బంలో జన్మించినప్పటికీ.. పేదలు, బడుగు బలహీ న వర్గాల పక్షాన నిలబడి వారి అభ్యున్నతి కోసం అనేక పోరాటాలు చేశారన్నారు.. సమాజంలో అం టరానితనం నిర్మూలనకు ఎంతగానో కృషి చేశార న్నారు. ఆయ న పేరు సుందరరామిరెడ్డి అయితే అందులో రెడ్డిని తొలగించి సుందరయ్యగా మార్చు కున్న గొప్ప వ్యక్తి అని గుర్తు చేశారు. ఆయన ఆశ య సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కో రారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యు త్ ప్రసాద్, మండల అధ్యక్షుడు రంగనాథ్, శ్రీరామి రెడ్డి యూనియన్ నాయకులు వన్నూరుస్వామి, ప రమేష్, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●గుంతకల్లుటౌన్: పట్టణంలోని సీపీఎం నాయకులు స్థానిక పార్టీ కార్యాలయంలో పుచ్చల పల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బీ.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

●కణేకల్లు: మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్టాం డ్‌లో ఉన్న ఆటో స్టాండ్ వద్ద పుచ్చలపల్లి సుంద రయ్య చిత్రపటానికి సీపీఐ, సీఐటీయూ నాయ కులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి కోరి నాగరాజు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

●రాయదుర్గంరూరల్: పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధం తిని నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటా నికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు నాగరాజు, మధు, తిమ్మరాజు, శంకర్, రమేష్, కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.


కళ్యాణదుర్గంలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఓబులు తదితరులు

దళిత మహిళలపై దాడి చేసిన వారిని శిక్షించాలి

కళ్యాణదుర్గంరూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): దళిత మహిళలపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. ఆయన సోమవా రం దళిత సంఘాల నాయకులతో కలిసి పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 14వ తేదీన బ్రహ్మసముద్రం మండలం కుర్లగుండ గ్రామంలో మామిడికాయలు కోశారని ముగ్గురు దళిత మహి ళలపై కొందరు దాడి చేసి గాయపరచడం అమా నుషమన్నారు. వెంటనే దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి కఠినంగా శిక్షించాల న్నారు. దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దళిత విద్యార్థిపై దాడి చేసిన వారిని..

గుంతకల్లుటౌన్: తిరుపతి జిల్లా చంద్రగిరి సమీపంలోని ఓ కళాశాలలో బీటెక్ చివరి సంవ త్సరం చదువుతున్న దళిత విద్యార్థి జేమ్స్‌పై ఇటీ వల కొందరు దాడి చేసి గాయపరిచారని, వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపా ధ్యక్షుడు వెంకటేష్ మాదిగ సోమవారం ప్రకట నలో డిమాండ్ చేశారు. జేమ్స్‌పై విచక్షణా రహి తంగా దాడి చేసిన వారిని పోలీసులు ఇంతవ రకు ఎందుకు అరెస్టు చేయలేదని మండిప డ్డారు. దళితలపై దాడులను రాష్ట్ర ప్రభుత్వం అరికట్టాలన్నారు. దళితులకు రక్షణ కల్పించాలని కోరారు.

ఏపీ ఉద్యోగుల సంఘం తాలూకా కమిటీ ఎన్నిక

గుంతకల్లుటౌన్, మే 19(ఆంధ్రజ్యోతి):పట్టణం లోని మండిబజార్ సచివాలయంలో ఆదివారం రా త్రి ఏపీ ఉద్యోగుల సంఘం గుంతకల్లు తాలూకా కమి టీని ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గోపీకృష్ణ, ఎన్నికల అధికారి రామునాయక్, కేసీ నాగరాజు, ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా మంజునాథ్, అసోసియేట్ అధ్యక్షురాలిగా డాక్టర్ సుజాత, జనరల్ సెక్రెటరీగా కల్యాణచక్రవర్తి, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, ఆది నారాయణ, ఈశ్వరమ్మ, సహాయ కార్యదర్శులుగా యోగానంద, జయమ్మ, అశ్విని, భాగ్యలక్ష్మి, పెన్న య్య, రామాంజనేయులు, కోశాధికారిగా పుష్పమిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నా యకులు తిమ్మరాజు, వరప్రసాద్ పాల్గొన్నారు.

జనారణ్యంలోకి నెమలి

●అటవీ అధికారులకు అప్పగింత

యాడికి, మే 19(ఆంధ్రజ్యోతి): జనారణ్యంలోకి వచ్చిన జాతీయ పక్షి నెమలిని పోలీసులు, స్థానిక యువకులు అటవీ అధికారులకు అప్పగించారు. మండలకేంద్రంలోని నారాయణస్వామికాలనీలోకి సోమవారం సాయంత్రం నెమలి వచ్చింది. గమ నించిన యువకులు దానిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ వెంకటరమణయ్య గుత్తి అటవీశాఖ అధికారులకు సమాచారం అందిం చారు. అటవీశాఖ బీట్ ఆఫీసర్ రామాంజనే యులు రాగా దానిని అప్పగించారు. నెమలిని అడవిలో వదలనున్నట్లు అటవీ అధికారి తెలి పారు. నెమలిని కాపాడి అప్పగించిన స్థానిక యువకులను పోలీసులు అభినందించారు.


నెమలిని అటవీ అధికారులకు అప్పగిస్తున్న పోలీసులు, యువకులు

మినీ మహానాడుకు తరలిరండి

పుట్లూరు, మే 19(ఆంధ్రజ్యోతి): గార్లదిన్నె మండలకేంద్రంలో ఈనెల 21వ తేదీన నియో జకవర్గ స్థాయి టీడీపీ మినీ మహానాడు జరగ నున్నట్లు ఆ పార్టీ పుట్లూరు మండల కన్వీనర్ బాలరంగయ్య సోమవారం ప్రకటనలో తెలి పారు. ఆ కార్యక్రమానికి మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్త లు పెద్దఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

మూడు ఇసుక టిప్పర్లు సీజ్

యాడికి, మే 19(ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న మూడు టిప్పర్లను ఆదివారం రాత్రి సీజ్ చేసినట్లు ఎస్ఐ వెంక టరమణయ్య తెలిపారు. కడపజిల్లా ఏటూరు రీచ్ నుంచి అనంతపురం జిల్లా గుంతకల్లుకు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న మూడు టిప్పర్లను రాయలచెరువు వద్ద జాతీయ రహదారిపై గుర్తించామని, ఇసుక రవాణాకు సంబంధించి ఎటువంటి అను మతి పత్రాలు లేకపోవడంతో వాటిని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని ఎస్ఐ పేర్కొన్నారు.

వీఆర్ఏ మృతికి పలువురి నివాళి

యాడికి, మే 19(ఆంధ్రజ్యోతి): మండలం లోని కోనుప్పలపాడు వీఆర్ఏ పెద్దకంబన్న (62) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయన 40ఏళ్లుగా కోనుప్పలపాడు వీఆర్ఏగా విధులు నిర్వర్తిస్తున్నారు. అతడి మృతి సమాచారం అందుకున్న యాడికి మండల రెవెన్యూ సిబ్బంది వెంటనే గ్రామా నికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి నివా ళులు అర్పించారు. నివాళులర్పించిన వారిలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఆర్ఐ కిష్టప్ప, పలు వురు వీఆర్వోలు, వీఆర్ఏలు ఉన్నారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా విజయ

యాడికి, మే 19 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ యాడికి సెక్టార్ సూపర్‌వైజర్‌గా విజయ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న విజయకుమారి తాడిపత్రి రూరల్‌కు బదిలీ అయ్యారు. సోమవారం బాధ్యతలు స్వీకరిం చిన విజయ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ తీరు మెరుగుపరుస్తా మని తెలిపారు.

మట్కాబీటర్ అరెస్టు

యాడికి, మే 19(ఆంధ్రజ్యోతి): మండలం లోని వేములపాడులో సోమవారం ఓ మట్కాబీటర్‌ను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి రూ.4850 నగదు, మట్కాచీటీలు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ వెంకటరమ ణయ్య తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వ హించి అరెస్టు చేశామని, అనంతరం కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

కంబదూరు వైస్ ఎంపీపీగా సోమశేఖర్


నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి

కంబదూరు, మే 19(ఆంధ్రజ్యోతి): కంబ దూరు వైస్ ఎంపీపీగా సోమశేఖర్‌ను ఎన్నుకు న్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాల యంలో వైస్ ఎంపీపీ ఉప ఎన్నిక నిర్వహించా రు. ఇప్పటి వరకు వైస్ ఎంపీపీగా ఉన్న లక్ష్మీ దేవి రాజీనామా చేయడంతో ఆ స్థానానికి ఉప ఎన్నిక చేపట్టారు. గొల్లపల్లి ఎంపీటీసీ మాధవి, వైస్ ఎంపీపీగా సోమశేఖర్ పేరును ప్రతిపా దించగా.. కంబదూరు-4 ఎంపీటీసీ చిన్న నరస మ్మ బలపరిచారు. 14 మంది ఎంపీటీసీ సభ్యు లు ఉండగా.. ములకనూరు సభ్యురాలు తిమ్మ రాజమ్మ గైర్హాజరయ్యారు. మిగిలిన 13 మంది ఎంపీటీసీ సభ్యులు చేతులెత్తి కంబదూరు-1 ఎంపీటీసీ సభ్యుడు సోమశేఖర్‌ను వైస్ ఎంపీ పీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నా రు. సోమశేఖర్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో వైఎస్ ఎంపీపీగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేయించారు. ఎంపీడీవో సూర్యనారాయణ, ఏవో తిప్పయ్య, కార్యాలయ సిబ్బంది పాల్గొ న్నారు. ఈ సందర్భంగా వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య, ఎంపీపీ లక్ష్మీ దేవి, జడ్పీటీసీ సభ్యుడు నాగరాజు తదితరులు సోమశేఖర్‌ను సన్మానించారు.

కలశ స్థాపన

యల్లనూరు, మే 19(ఆంధ్రజ్యోతి): మం డలకేంద్రంలోని ఆంజనేయస్వామి ఆల యంలో కలశస్థాపనను సోమవారం సా యంత్రం ఘనంగా నిర్వహించారు. మహా కుంభాభిషేక కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్య క్రమం నాలుగురోజుల జరగనున్నట్లు పురోహితుడు చందుస్వామి తెలిపారు.

ఎండుఫలాల అలంకరణలో నెట్టికంటుడు

గుంతకల్లు, మే 19(ఆంధ్రజ్యోతి): క సాపురంలోని నెట్టికంటి ఆలయంలో సోమవారం స్వామివారు ఎండు ఫలా ల అలంకారంలో దర్శనమిచ్చారు. దక్షి ణాది హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రధానార్చకులు ఉదయమే ఆలయంలో స్వామివారి మూల విరా ట్టుకు అభిషేకాలను నిర్వహించి, ఎండు ఫలాలతో అలంకరించారు. అనంతరం ప్రాతఃకాల ఆరాధన చేసి, ప్రత్యేక పూజలు జరిపి భక్తులకు దర్శనం కల్పిం చారు. తర్వాత యాగశాలలో సుందర కాండ, మన్యుసూక్త పారాయణం చేశారు. అలాగే శ్రీరామ ఆంజనేయ మూలమంత్ర అనుష్టానాలు, సుందరకాండ హోమం, మన్యుసుక్త హోమం నిర్వహించారు. సాయంత్రం నుంచి ఆంజనేయ ఉత్సవ విగ్ర హానికి తమలపాకుల లక్షార్చన, వేదగోష్టి తదితర కార్యక్రమాలను జరిపారు. ఆలయ ఈఓ వాణి, ధర్మకర్త సుగుణమ్మ, ఏఈఓ వెంకటే శ్వరుడు, సూపరింటెండెంటు వెంకటేశులు, ప్రధానార్చకులు అనంతా చార్యులు, రాఘవాచార్యులు, వేద పండితుడు రామకృష్ణావధాని, పరి చారకులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఎండు ఫలాల అలంకరణలో దర్శనమిస్తున్న ఆంజనేయస్వామి

వైభవంగా భద్రావతి భావనారుషీశ్వరుల కల్యాణం

తాడిపత్రి, మే 19 (ఆంధ్రజ్యోతి): పట్టణం లోని మార్కండేయస్వా మి ఆలయంలో సోమ వారం పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో భ ద్రావతి భావనారుషీశ్వ రుల కల్యాణం వైభవం గా జరిగింది. ఈ సంద ర్భంగా తొలుత అర్చకులు ఆలయంలోని భద్రావతి భావనారుషీశ్వ రుల మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను అలంకరించి వేద మంత్రోచ్ఛారణల మధ్య, మంగళవాయిద్యాల నడుమ కల్యాణం అంగ రంగవైభవంగా జరిపారు. ఉత్సవాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు.


ప్రత్యేక అలంకరణలో భద్రావతి భావనారుషీశ్వరుల ఉత్సవమూర్తులు

మయూర వాహనంపై ఊరేగిన శ్రీవారు

రాయదుర్గం రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటలో ప్రసన్న వేంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మయూర వాహన సేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉద యమే ఆలయంలో భూదేవి, శ్రీదేవిసమేత స్వామివారి మూల విరాట్‌కు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం ఉత్స వమూర్తులను అలంకరించి మయూర వాహనంలో కొలువుదీర్చి ప్రధాన వీధుల్లో ఊరేగించారు. అనంతరం రాత్రి 8 గంటలకు వసంతోత్సవంలో భాగంగా కంకణ విస ర్జన, చక్రస్నానం, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం నిర్వ హించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఊరేగింపులో విశ్వ హిందూ పరిషత్, రజక, హరిజన, మాల, హట్కారి, కత్తెర సంఘం నాయకులు పాల్గొన్నారు.


మయూరవాహనంపై దర్శనమిస్తున్న వేంకటరమణుడు

ఎక్సైజ్ ఇన్‌చార్జి సీఐగా గురుప్రసాద్



కళ్యాణదుర్గం రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): కళ్యాణ దుర్గం ఎక్సైజ్ ఇన్‌చార్జి సీఐగా గురుప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న హసీనా బాను అవినీతి ఆరోపణలు, ఆఫీసు బాయ్‌ని చెప్పుతో కొట్టడం వంటి వివాదాలతో ఉరవకొండకు బదిలీ అయిన విషయం తెలి సిందే. ఈమె స్థానంలోకి ఇన్‌చార్జి సీఐగా విడపనకల్లు చెక్‌పోస్టు నుంచి బదిలీపై వచ్చినట్లు గురుప్రసాద్ తెలిపారు. అక్రమమద్యం, నాటుసారా తదితర వాటిపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

మార్కెట్‌యార్డు కమిటీ ఏర్పాటు

రాయదుర్గం, మే 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాయదుర్గం మార్కె ట్‌యార్డు కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులతోపాటు సభ్యులను నియమిస్తూ సోమవారం జీఓను విడుదల చేసింది. ఇందులో కమిటీ అధ్యక్షుడిగా ఉండాల హనుమంతరెడ్డి, ఉపాధ్యక్షుడిగా మిద్దింటి దానవేంద్రను నియమించారు. ఇక సభ్యులుగా అక్కిరెడ్డి తులసి, బసలు హంపమ్మ, జీ .నిర్మల, హరిజన భారతి, హరిజన ఆనంద, సాలిబాయి, తూర్పు రఘునాథ, ఊరుగంటి తిమ్మారెడ్డి, కొల్లూరు హనుమంతు, వేలూరు విశాలాక్షి, వడ్డె అంబోజీరావు, జీ. లావణ్య, ఉంతకల్లు చాంద్‌బాషాను నియమించారు. వీరితో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్, మార్కెటింగ్ జిల్లా అగ్రి ట్రేడ్ అధికారి, వ్యవసాయశాఖ ఏడీ, గొడిశలపల్లి పీఏసీ ఎస్ సొసైటీ సెక్రెటరీలను కూడా సభ్యులుగా నియమించారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

యాడికి, మే 19(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో జేసీ ప్రీమియ ర్‌లీగ్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. సోమవా రం నిర్వ హించిన పోటీల్లో యాడికి, రాయలచెరువు, రామరాజుపల్లి గ్రామాలకు చెందిన 8 జట్లు తలపడ్డాయి. ప్రతిభచూపిన క్రీడాకారులకు నిర్వా హకులు విశ్వనాథ్, తిరంపురం నీలకంఠ, నారాయణస్వామి, ఆదినా రాయణ మెమొంటోలను అందజేశారు. మరో వారంరోజుల పాటు క్రికెట్ పోటీలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా తిరంగా యాత్ర ర్యాలీలు

రాయదుర్గం, మే 19(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూ ర్‌తో మన దేశ పోరాట పటిమను చాటి చెప్పిన సైనికు లకు వందనం తెలియజేస్తూ పట్టణంలో సోమవారం ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, టీడీపీ జిల్లా అధ్య క్షుడు వెంకటశివుడు యాదవ్‌తో పాటు ప్రజలు, ఇతర ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, అధికారులు తిరంగా యాత్ర ర్యాలీని ఘనంగా నిర్వహించారు. స్థానిక సీతారామాంజనేయస్వామి కల్యాణమంటపం నుంచి బళ్లారిరోడ్డు మీదుగా వినాయకసర్కిల్ వరకు ర్యాలీని చేపట్టారు. ప్రతిఒక్కరూ జాతీయ జెండాలను చేతపట్టి ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అలాగే దేశ భక్తిని చాటేలా ర్యాలీలో వెయ్యి అడుగుల జాతీయ జెండాను ప్రదర్శించారు. ఆపరేషన్ సింధూర్‌లో అమరు డైన వీరజవాన్ మురళీనాయక్ చిత్రపటానికి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా కాలవ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం తిరుగులేని శక్తిగా ప్రపంచ దేశాల్లో అవతరించిందన్నారు. పహల్గాంలో భారతీయ యాత్రికులను దొంగదెబ్బ తీస్తే.. పాకిస్థాన్‌లో ప్రధానమైన ఉగ్ర స్థావరాలన్నింటిని నేలమట్టం చేసిన భారతప్రభుత్వానికి సెల్యూట్ చేస్తున్నామన్నారు. ఇందుకు వీరోచితంగా పోరాడిన భారతసైన్యానికి, త్రివిధ దళాలకు అందరం కృతజ్ఞులై ఉండాలన్నారు. కార్యక్ర మంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్లు శిల్ప, జనసేన ఇన్‌చార్జి మంజునాథ్‌గౌడ్, మార్కెట్‌యార్డు చైర్మన్ హ నుమంతరెడ్డి, బీజేపీ నాయకుడు అంబోజీరావు, మున్సి పల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● గుంతకల్లుటౌన్: పట్టణంలో టీడీపీ, బీజేపీ, జన సేన నాయకులు, కార్యకర్తలు సాయంత్రం తిరంగా యాత్ర ర్యాలీని ఘనంగా నిర్వహించారు. అజంతా సర్కిల్ నుంచి మొయిన్ రోడ్డు మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ వరకు ఈ ర్యాలీని కొనసాగించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థా న్ ఉగ్రవాదులను మట్టుబెట్టిన భారత సైనికులకు సెల్యూట్ చేస్తున్నామన్నారు. అలాగే ఉగ్రవాదుల చేతిలో మృతిచెందిన మన దేశ పౌరులకు, సైనికులకు నివాళు లర్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్య క్షుడు బండారు ఆనంద్, జనసేన సమన్వయ కర్త వాసి గిరి మణికంఠ, నాయకులు తలారి మస్తానప్ప, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, న్యాయవాది బీఎస్ కృష్ణారెడ్డి, అంజి, హనమంతు, చిప్పగిరి ప్రతాప్, గుజరిమహమ్మద్ ఖాజా, మాతృనాయక్, పాల మల్లికార్జున, బీజేపీ, జనసేన, కౌన్సి లర్లు, నాయకులు పాల్గొన్నారు

● బొమ్మనహాళ్: మండల కేంద్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు తిరంగా యాత్ర ర్యాలీని నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ కురవల్లి రోడ్డు వరకు సాగింది. ఇందులో ప్రతిఒక్కరూ భారతీయ జెండాను చేతపట్టి భారత్‌మాతాకీ జై అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. పలువురు మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ విజయవంతమైనందుకు భారత త్రివిధ దళాల సైనికు లకు సంఘీబావంగా ర్యాలీ చేస్తున్నామన్నారు. కార్యక్ర మంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లి కార్జున, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ హీరోజీరావు, టీడీపీ నాయకులు మల్లీడు శ్రీనివాసులు, పయ్యావుల నాగ రాజు, జనసేన నాయకుడు సికిందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


రాయదుర్గంలో ర్యాలీ చేస్తున్న ప్రభుత్వ విప్ కాలవ, టీడీపీ నాయకులు



గుంతకల్లులో ర్యాలీలో పాల్గొన్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు


బొమ్మనహాళ్ లో..